


# విజయభాను

విజయవాడ, గురువారం 31-08-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 88 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఆధార్‌పై కేంద్ర నిర్ణయం...

### పథకాల లబ్ధిదారులకు ఊరట...



న్యూఢిల్లీ : ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు శుభవార్త. ఆధార్ నమోదు గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 30కి పైగా ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందాలంటే ఆధార్ వివరాలను సమర్పించడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న అటార్నీ జనరల్ కే కే వేణుగోపాల్ ఆధార్ నమోదు గడువు ప్రస్తుతం సెప్టెంబరు 30 అని, ఈ గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు.

ఆధార్ స్కీమ్‌ను, ఆధార్ చట్టం, 2016ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఏ ఎం ఖన్విల్కర్ ధర్మాసనం ఈ పిటిషన్లపై వాదనలను వింటోంది. పిటిషనర్ల తరపు న్యాయవాది శ్యామ్ దివాన్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ పథకాల ప్రయోజనం పొందాలంటే తరువాయి 2లో


### ఈశాన్యంలో ప్రసాదాల పోటు

## నిర్మిస్తే అభివృద్ధికి ఆటంకం

### పీఠాధిపతి పురుషోత్తమ భారతీ మహాస్వామి



ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రసాదాల పోటును ఈశాన్యంలో నిర్మిస్తే దేవస్థానం అభివృద్ధికి ఆటంకమవుతుందని శృంగేరి శివగంగ శారద పీఠాధిపతి పురుషోత్తమ భారతీ మహాస్వామి అన్నారు. సత్యనారాయణపురంలోని రామకోటిలో చాతుర్మాస దీక్ష సందర్భంగా విజయవాడ వచ్చిన స్వామి ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో సూర్యకుమారి, వేద పండితులు, పాలకమండలి సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. మూలవిరాట్ దుర్గమ్మకు గంటన్నర సేపు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆశీర్వచన మండపంలో దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు, రుత్వికులు, పాలకమండలి సభ్యులు ఆయన ఆశీర్వచనం తీసుకున్నారు. దేవస్థానం ఈవో సూర్యకుమారి ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. తిరిగి వెళ్లే సమయంలో ప్రసాదాల పోటును ఈశాన్యంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేయాలన్న ప్రతిపాదన, నైరుతిలో జలపాతాల పేరుతో గోతులు తవ్విన విషయాన్ని పాలకమండలి తరువాయి 2లో



## ఆ గెలుపు సీఎం కష్టానికి నిదర్శనం

### మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

విజయవాడ: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా విజయం సీఎం చంద్రబాబు మూడేళ్ల కష్టానికి ఒక నిదర్శనమని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నంద్యాల ఓటమి తర్వాత పునరాలోచనలో పడిన వైకాపా నేతలకు కాకినాడలో కూడా ఓటమి తప్పదని, అందుకే ఆ పార్టీ నేతలు ఓటమికి కారణాలు వెతుక్కొనే పనిలోపడ్డారని ఆరోపించారు. కాకినాడ పురపాలక ఎన్నికల్లో వైకాపాకు సింగిల్ డిజిట్ ఫలితమే రాబోతుందని జోస్యం చెప్పారు.

## పరిటాల రవి ఆశయాలు నెరవేరుస్తాం



అనంతపురం: పరిటాల రవి మరణించి ఎంత కాలమైనా ప్రజల గుండెల్లో ఆయన చేసిన పోరాటాలు నిలిచే ఉంటాయని మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత అన్నారు. అనంతపురం జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో రవి జయంతిని నిర్వహించారు. రవి ఘాట్ వద్ద కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి దేవినేనితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు తరువాయి 2లో

## జనజీవనం అతలాకుతలం

- నదులను తలపించేలా వీధులు
- రాత్రంతా ఆఫీసుల్లోనే..
- వరద బాధితుల కోసం కమ్యూనిటీ కిచెన్లు
- ఛార్జీలను తగ్గించిన క్యాబ్‌లు, ఊబర్‌లు



దిల్లీ: దేశ ఆర్థిక రాజధాని ముంబయిని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. మంగళవారం కురిసిన వర్షానికి ముంబయి నగరం సముద్రంలా మారిపోయింది. సాధారణం కన్నా తొమ్మిది రెట్లు ఎక్కువగా వర్షం కురవడంతో వీధులన్నీ నదులను తలపించాయి. అడుగు బయటపెట్టే పరిస్థితి లేకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం ఆఫీసులకు వెళ్లిన ఉద్యోగులు తిరిగి ఇంటికి వెళ్లలేకపోయారు. దీంతో రాత్రంతా వారు ఆఫీసుల్లోనే గడపాల్సి వచ్చింది.

మంగళవారం ఉదయం పరిస్థితి మామూలుగానే ఉంది. దీంతో స్కూళ్లు, ఆఫీసులు యథావిధిగా తెరుచుకున్నాయి. తరువాయి 2లో

## వ్యవసాయ విద్య డిప్లొమా విద్యార్థులకు ఉన్నత అవకాశాలు



గుంటూరు: వ్యవసాయ విద్య డిప్లొమా కోర్సులు చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టరు వి.దామోదరనాయుడు తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాం ఆడిటోరియంలో వ్యవసాయ విద్య డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారం జరిగింది. ఉపకులపతి మాట్లాడుతూ డిప్లొమా కోర్సులు చదివిన విద్యార్థులకు వ్యవసాయ విద్య బీఎస్సీలో 20 శాతం సీట్లను కేటాయిస్తున్నామన్నారు. స్వయం ఉపాధిని కూడా పొందవచ్చన్నారు. అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయ పరిధిలోని విద్యార్థులతో పాటు స్థానికేతర విద్యార్థులకు కౌన్సెలింగ్ చేపట్టారు. సీట్లు పొందిన విద్యార్థులకు వీసీ దామోదరనాయుడు ప్రవేశ పత్రాలను అందజేశారు. కౌన్సెలింగ్‌ను వర్శిటీ పాలిటెక్నిక్ కోర్సుల సమన్వయకర్త డాక్టరు సునీల్‌బాబు కొనసాగించారు. 500 మంది విద్యార్థులు సీట్లు పొందారు. కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రార్ డాక్టరు టి.వి.సత్యనారాయణ, వ్యవసాయ విభాగం డీన్ డాక్టర్ రమేష్‌బాబు, వర్శిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్‌పాల్‌పై జాప్యం తగదు



### మోదీకి 'అన్నా' ఘాటు హెచ్చరిక

న్యూఢిల్లీ : అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడుతున్న అన్నా హజారే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని హెచ్చరించారు. లోక్‌పాల్ నియామకంలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం మోదీకి రాసిన లేఖలో లోక్ పాల్ కోసం మరోసారి తీవ్ర తరువాయి 2లో





### టేకిట్ ఈజీ



ఇంటినుంచి బయటకు జాగ్రత్తగా వెళ్లండి.. రోడ్లపై నదుల్లా వరదనీరు.. చూసుకోండి!!

## బ్యాంకింగ్ నేరాలపై అప్రమత్తత అవసరం

### భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై .. పోలీసు, బ్యాంకు అధికారుల సమావేశం




విజయవాడ : సెల్‌ఫోన్‌కు వచ్చే బ్యాంకు ఒన్‌టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) అత్యంత భద్రమైనదని దీన్ని ఎవరికీ చెప్పకూడదని సంయుక్త పోలీస్ కమిషనర్ బి.వి.రమణకుమార్ పేర్కొన్నారు. ఓటీపీ చెప్పమని బ్యాంకర్లు ఎవరూ ఫోన్లు చేసి అడగరని అటువంటి ఫోన్లపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. హనుమాన్‌పేటలోని ఆలపాటి రామారావు కల్యాణ మండపంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్, బ్యాంకింగ్, ఆన్‌లైన్‌మోసాలు వాటి కట్టడిలో బ్యాంకర్ల పాత్ర అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ తరహాల్లో జరుగుతున్న బ్యాంకింగ్ నేరాలు, నేరాల నిరోధానికి బ్యాంకులు తీసుకుంటున్న చర్యలు, బ్యాంకుల పాత్ర అనే అంశంపై ప్రైవేటు, ప్రభుత్వ బ్యాంకుల ప్రతినిధులు, పోలీసు అధికారులతో చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బి.వి.రమణకుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ల, తరువాయి 2లో

# పోలీసులపై హక్కుల కమిషన్‌లో ఫిర్యాదులు

హైదరాబాద్: నగరంలోని బహదూర్‌పుర, జగిత్యాల జిల్లా సారంగపూర్, సిద్దిపేట జిల్లా కోహెడ పోలీసుల తీరుతో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయా ప్రాంతాలకు చెందిన బాధితులు మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసేలా బహదూర్‌పుర పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పాతబస్తీ గొల్లకిడికి, కబూతర్‌ఖానాకు చెందిన టి.నవనీత రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్చార్సీ)ను ఆశ్రయించారు. కేసు విచారణకు స్వీకరించిన కమిషన్ నవంబరు 14లోపు సమగ్ర నివేదికను సమర్పించాలని చార్మినార్ ఏసీపీకి నోటీసులు జారీ చేసింది. గత నెల 5న ఆమె భర్త దిలీప్‌సింగ్ ఉద్యోగ విధులకు వెళుతుండగా బహదూర్‌పుర పోలీసు ఠాణా పరిధిలో అతి వేగంగా వచ్చిన ఆటో (నంబరు ఏపీ23 వై 2654) బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడమకాలిలో రెండు చోట్ల ఎముక విరిగింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇప్పటికే రెండు శస్త్రచికిత్సలు జరిగాయని బాధితురాలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న బహదూర్‌పుర పోలీసులు ఆసుపత్రిలో నా భర్త వాంగ్మూలాన్ని, ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదును స్వీకరించారన్నారు. కానీ డ్రె%వర్‌పై మాత్రం కేసు నమోదు చేయడం లేదన్నారు. అక్కడున్న ఎస్త్రై శివకృష్ణ ఉద్దేశ్యపూర్వకంగా కేసు నమోదు చేయడం లేదని ఆమె కమిషన్‌కు వివరించారు. ప్రమాదం తరువాత తన భర్త అత్యంత బాధాకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, కుటుంబం వీధినపడిందని వాపోయారు. న్యాయం చేయాలని కమిషన్‌ను వేడుకున్నారు. తన భర్తపై తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారంటూ సారంగపూర్ పోలీసులపై మేడిపల్లి మండలం, కట్లకుంటకు చెందిన బాధితురాలు ముస్కు కల్పన ఫిర్యాదు చేశారు. అక్టోబరు 25లోపు ఈ విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ కమిషన్ ఆ జిల్లా ఎస్పీని ఆదేశించింది.

కుటుంబపరమైన ఆస్తి తగాదాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా.. అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారంటూ కోహెడ పోలీసులపై రామచంద్రాపూర్‌కు చెందిన బత్తుల రాజు కమిషన్‌కు ఫిర్యాదు అందించారు. నవంబరు 14లోపు ఈ కేసుపై నివేదిక సమర్పించాలని కమిషన్ సిద్దిపేట పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## ఉద్యాన మహోత్సవంలో పాల్గొన్న స్పీకర్



హైదరాబాద్: నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో కొనసాగుతున్న తెలంగాణ ఉద్యాన మహోత్సవాన్ని శాసనసభాపతి మధుసూదనాచారి సందర్శించారు. అక్కడి పలు స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రదర్శనను ఇప్పటి దాకా దాదాపు 50వేల మంది సందర్శించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాల నుంచి ఆరొందల మంది రైతులు ప్రదర్శనకు రాగా వారికి సేంద్రియ సాగు పద్ధతిలో ఉద్యాన పంటల సాగు, అత్యధిక సాంద్రత పద్ధతిలో మామిడి సాగు, పట్టు పురుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. 31 వరకు ప్రదర్శన ఉంటుందని అధికారులు తెలిపారు.

## క్రమశిక్షణతో కూడిన అభ్యసనే కీలకం



మచిలీపట్నం: క్రమశిక్షణతో కూడిన అభ్యసనే కీలకమని జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. బందరు మండలం తపసిపూడిలో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను శిక్షణ ఇస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ శిక్షణలో మానసిక, శారీరక శ్రమలు మిళితమై ఉంటాయనీ, రెంటిని సమపాళ్లలో స్వీకరించాలన్నారు. శారీరక శ్రమకు సంబంధించి డ్రిల్ విషయంలో ఇబ్బందులు ఎదురైనా అధిగమించేలా మనోస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యసిద్ధే లక్ష్యంగా పనిచేసినప్పుడే విజయాలు చేరువ అవుతాయన్నారు. ప్రతి తరగతి గదిని పరిశీలించిన ఎస్పీ శిక్షణార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఇతత్రతా అవసరాల పట్ల ఆరా తీశారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎస్పీ అన్నారు. పోలీస్ శిక్షణ కేంద్రంలో ఆయన శిక్షణార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను దత్తత తీసుకుని శిక్షణకాలం పూర్తయ్యేవరకూ వాటితో అనుబంధం కొనసాగించాలని సూచించారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని చెప్పారు. డీటీసీ డీఎస్పీ వెంకట రమణమూర్తి, ఏఆర్ డీఎస్పీ బి.నారాయణరావు, ఆర్ఐ కృష్ణంరాజు, తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

## తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం

ఛత్రపురం : గంజాం జిల్లా తైక్వాండో అసోయేషన్ ఆధ్వర్యంలో ఛత్రపురంలోని పబ్లిక్ స్కూల్లో రంగు బెల్టుల పరీక్ష, పలు అంశాల ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటైంది. ఇందులో జిల్లాలోని వివిధచోట్ల నుంచి 40 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండి సేవలందించండి

డోన్ : రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని డోన్ డివిజన్ ఏడీఏ రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక పశు వైద్యశాల సమావేశ భవనంలో ఎంపీఈవోలు, ఆత్మ సిబ్బందితో శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఏఏ పంటలు సాగు చేశారనేది గ్రామాల్లో తిరిగి తెలుసుకొని ఆన్‌లైన్ బుకింగ్‌లో నమోదు చేయాలన్నారు.

# సంఘ సేవతో కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేం

## ఎన్‌టీఆర్ సేవా సమితి తొమ్మిదో వార్షికోత్సవాలు

**జమ్మల జయలక్ష్మీ**



బ్రహ్మపుర : సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఎదుటి వారి ముఖాల్లో కనిపించే ఆనందం మాటల్లో వర్ణించలేమని, ఆ ఆనందానికి కొలబద్ధ లేదని రోలాండు విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ జమ్మల జయలక్ష్మి అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ సేవా సమితి తొమ్మిదో వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఖస్పావీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఆవరణలో జరిగిన వేడుకలకు అతిథిగా హాజరైన జయలక్ష్మి మాట్లాడుతూ సంఘ సేవతో కలిగే ఆనందం అనిర్వచనీయమైనదని చెప్పారు. ఎన్‌టీఆర్ సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆమె అభినందించారు. 'సేవా' సమితి పేరులోనే అర్థం, పరమార్థముందని చెప్పారు. ఎన్‌టీఆర్ సేవా సమితి సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరంగా నిర్వహించాలని ఆమె కోరారు. మరో అతిథిగా హాజరైన యువ వైద్య నిపు ణుడు సునీల్ కుమార్ కోట మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఆయన పేరిట సేవా సమితి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ కోట ప్రేక్షకులకు పలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. అతిథిగా పాల్గొన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం అసోసియేట్ మేనేజింగ్ ట్రస్టీ జామి శ్రీనివాస రావు మాట్లాడుతూ సేవా సమితి భవన నిర్మాణానికి అవసరమయ్యే స్థలం సమకూర్చేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నానని హర్షధ్వానాల మధ్య తెలిపారు. సేవా సమితి గౌరవ సలహాదారు, వైద్యుడు జమ్మల నారాయణరావు సమన్వయకర్తగా వ్యవహరించిన వేడుకల్లో సేవా సమితి అధ్యక్షుడు ఆర్.తిరుపతిరావు ప్రారంభోపన్యాసం చేయగా, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు నివేదిక సమర్పించారు. ఈ సందరేగా వేడుకల్లో జమ్మల నారాయణరావు, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు)లను నిర్వాహకులు సత్కరించారు. సేవా సమితి నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలు, వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు అతిథులతోపాటు తూతిక గోపి, కార్పొరేటరు పోలాకి ఆశారాణి తదితరులు బహు మతులు, జ్ఞాపికలు అందజేశారు. అంతకుముందు జమ్మల శైలజ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. చివరిగా స్థానిక క్రేజీ స్టార్ డ్యాన్స్ అకాడమీ ఔత్సాహిక కళాకారులు ఆధునిక నాట్యాలతో అలరించగా, బీఎస్ఎస్ఆర్ బ ృందం గాయనీ, గాయకులు మధుర గీతాలు ఆలపించారు. వేడుకల్లో కాశీబుగ్గకు చెందిన ఈశ్వర పాత్ర్ ధ్వన్య నుకరణ, మాట్లాడే బొమ్మతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. సేవా సమితి ప్రతినిధులు సీహెచ్.చక్రధరరావు, ఏ.లక్ష్మీప్రసాద్ ఇతర ప్రతినిధులు సహకరించారు. వేడుకలకు పలువురు స్థానిక కార్పొరేటర్లు, తెలుగు సంస్థల ప్రతినిధులు, సేవా సమితి ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## ఎన్నికల పరిశీలకుడిగా విలాస్‌రాథోడ్

విజయవాడ: కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా మహారాష్ట్రకు చెందిన విలాస్‌రాథోడ్ కృష్ణాజిల్లాకు విచ్చేసిన సందర్భంగా బందరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామిశెట్టి ప్రసాద్ ఆయనను కలిశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 162 క్రియాశీలక సభ్యత్వ ఫారాలను అందజేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యవర్గంలోకి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ మతీన్, జిల్లా అధికార ప్రతినిధి ధర్మారావు, పార్లమెంట్ మైనార్టీ సెల్ ఛైర్మన్ దాదాసాహెబ్, ఫణిభూషణ్‌లను, పీసీసీ కార్యవర్గంలోకి రామిశెట్టి ప్రసాద్‌ను తీసుకున్నట్లు డీసీసీ అధ్యక్షుడు డి.మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, మధు, సుల్తానారజియా తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి లడ్డూ రూ.2 లక్షలు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట మండలంలోని నిడిముసలి గ్రామంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం వద్ద నిర్వాహకులు పెట్టిన 12 కిలోల లడ్డూకి వేలం నిర్వహించగా పలువురు పోటీ పడ్డారు. చివరికి అదే గ్రామానికి చెందిన కోట రాధాకృష్ణారెడ్డి అందరికన్న అధికంగా రూ.2 లక్షలకు పాడి దక్కించుకున్నారు. గత ఏడాది ఇక్కడే లడ్డు వేలాం నిర్వహించగా రూ.1.82 లక్షలకు పాడారు. ఈఏడాది అదనంగా రూ.18 వేలు పెరిగింది.

## గ్రామంలో మద్య నిషేధానికి తీర్మానం



కంప్లి : ముద్దాపుర గ్రామ పంచాయతీ పరిధిలో మద్య నిషేధానికి గ్రామ పంచా యతీ తీర్మానించింది. అధ్యక్షురాలు ఎం.ఎస్. మాంతమ్మ అధ్య క్షతన జరిగిన సమా వేశంలో సభ్యులు ఏకగ్రీవంగా మద్య నిషేధానికి అంగీక రించారు. పంచాయతీ పరిధి లోని 10.ముద్దాపుర, బెళగోడు హాళ, కణవి తిమ్మలాపుర, ప్రభు క్యాంపు, యల్లమ్మక్యాంపు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు అధికమయ్యాయి. గ్రామాల్లో దండోరా వేయించి మద్యం విక్రయా లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. ప్రభు క్యాంపులో రోడ్లు వేశారు. మురికికాల్వలు నిర్మించలేదు. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. మరికొన్ని చోట్ల మురికికాల్వలు నిండిపోయి మురుగు వీధుల్లో పారుతుంది. వర్షాకాలం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తగు చర్యలు తీసుకోవాలని అక్కడి సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. అభివృద్ధి అధికారి బీర లింగ మాట్లాడుతూ పంచాయతీకి నిర్వహణ ఖర్చులు అధికమవుతున్న దృష్ట్యా ఈ సారి ఇంటి పన్ను పెంచామన్నారు. ప్రభుక్యాంపులో ఇంటి పన్ను వసూలు చేసి ఆ నిధులతో అక్కడే పనులు చేపడతామని తెలిపారు. ముద్దాపురలో మరో 150 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తే గ్రామంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవుతుంది. గాంధీ జయంతిలోపు వాటిని సైతం పూర్తి చేస్తామన్నారు. అనంతరం వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఉపాధ్యక్షుడు ఉమేష్, కార్యదర్శి హనుమంతప్ప, తాయణ్ణ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## జనజీవనం అతలాకుతలం

కాసేపటికే భారీ వర్షం మొదలైంది. దీంతో స్కూళ్లు, ఆఫీసులు మూసేసి చిన్నారులు, ఉద్యోగులను ఇంటికి వెళ్లాలని యాజమాన్యాలు సూచించాయి. అయితే అప్పటికే వర్షం తీవ్రరూపం దాల్చింది. ఎటుచూసినా వరదనీరే.. బయటకు వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీంతో చాలా మంది ఉద్యోగులు రాత్రంతా ఆఫీసుల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. కొందరు సమీపంలోని తమ బంధువులు, సహ ఉద్యోగుల ఇళ్లకు వెళ్లారు. బుధవారం ఉదయం వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో ఉద్యోగులు ఆఫీసుల నుంచి ఇళ్లకు బయల్దేరారు. ముంబయి వ్యాప్తంగా నేడు విద్యాసంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

మరోవైపు వరదల నేపథ్యంలో క్యాబ్ సర్వీసులు ఓలా, ఉబర్‌లు ఛార్జీలను తగ్గించాయి. పూల్ సర్వీసులను ఉచితంగా అందిస్తామని ప్రకటించాయి. కాగా.. వరద బాధితుల కోసం భారత నేవీ సిబ్బంది కమ్యూనిటీ కిచెన్లు, ఫుడ్ కౌంటర్లను తెరిచారు.

## లోక్‌పాల్‌పై జాప్యం తగదు

స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కేంద్రంలో ఎన్డీయే అధికారం చేపట్టి మూడేళ్ళు పూర్తయినప్పటికీ లోక్‌పాల్ నియామకంలో తాత్సారం జరుగుతోందని హజారే ఆరోపించారు. ప్రభుత్వ ఉదాసీనతకు వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేశారు. లోక్‌పాల్‌తో పాటు ఆహార భద్రత, రైతు సంక్షేమం గురించి వివరిస్తున్న స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలు కోసం కూడా తాము ఉద్యమిస్తామని పేర్కొన్నారు. భారతదేశాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జరిగిన చరిత్రాత్మక ఉద్యమానికి ఆరేళ్ళు పూర్తయిందని, ఇప్పటికీ ప్రభుత్వం అవినీతిని అంతమొందించేందుకు తగిన పటిష్ట చట్టాన్ని రూపొందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో లోక్‌పాల్‌ను, ప్రతి రాష్ట్రంలోనూ లోకాయుక్తను నియమించాలని, అవినీతి భరతం పట్టేందుకు సిటిజన్స్ చార్టర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమ కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నా హజారే సన్నిహిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపాయి.

## ఆధార్‌పై కేంద్ర నిర్ణయం...

తప్పనిసరిగా ఆధార్ వివరాలను సమర్పించాలని, ఆధార్ నమోదుకు గడువు సెప్టెంబరు 30 అని ప్రభుత్వం చెప్తోందని, అందువల్ల తమ పిటిషన్లపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వం ఆధార్ నమోదు గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించడంతో తదుపరి విచారణను నవంబరు మొదటి వారంలో నిర్వహిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

## పరిటాల రవి ఆశయాలు నెరవేరుస్తాం

నివాళులర్పించి రవితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సునీత మాట్లాడుతూ.. రవి 60వ ఏట షష్ఠిపూర్తి చేసుకోవాల్సిన సందర్భంలో నివాళులర్పించడం బాధగా ఉందన్నారు. రవి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి దేవినేని మాట్లాడుతూ.. ప్రజల కోసం పోరాటాలు చేసిన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ హయాంలో హత్య చేశారని.. ఆ సంస్కృతిని ఇప్పటికైనా విడనాడాలన్నారు.

## ఈశాన్యంలో ప్రసాదాల పోటు నిర్మిస్తే అభివృద్ధికి ఆటంకం

సభ్యుడు జి. పద్మశేఖర్ స్వామి వద్ద ప్రస్తావించారు. స్పందించిన స్వామి అక్కడే ఉన్న వైదిక కమిటీ సభ్యుడు శంకరశాండిల్యను పిలిచి మాట్లాడారు. దేవస్థానంలో పనులు ఇష్టానుసారంగా చేస్తే అభివృద్ధి ఏవిధంగా సాధ్యపడుతుంది. రాష్ట్రానికి కూడా మంచి జరగదు. భక్తులు, అధికారులకు మనఃశ్శాంతి ఉండని పనులు ఎందుకు చేస్తున్నారు. ఈ విషయంలో ఈవో, అధికారులకు మంచి సలహాలు ఎందుకు ఇవ్వడం లేదు. నిర్మాణాల విషయంలో అధికారులకు తగు సూచనలు చేయాల్సిన బాధ్యత మనపైన ఉంది కదా? అని అన్నారు. దేవస్థానం స్థానాచార్య శివప్రసాదశర్మ, పాలక మండలి సభ్యులు బడేటి ధర్మారావు, కె. సూర్యలత, సీహెచ్. సాంబసుశీల, బ్రాహ్మణ కార్పొరేషను కోఆర్డినేటర్ గండూరి మహేష్ పాల్గొన్నారు.

**హుండీ ఆదాయం రూ.1.90 కోట్లు**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల ఆదాయాన్ని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో దేవస్థానం సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు లెక్కించారు. 34 హుండీల్లో 21 రోజుల్లో వచ్చిన కానుకలను లెక్కించగా రూ.1,90,16,127 ఆదాయం వచ్చింది. అందులో రూ.8,36,927ల చిల్లర నాణేలు ఉన్నాయి. చిల్లర నాణేలను బ్యాంకు సిబ్బంది స్వీకరించి అందుకు సంబంధించి వచ్చే కమీషను కూడా కలిపి బ్యాంకులో అధికారులు డిపాజిట్టు చేశారు. 685 గ్రాముల బంగారం వస్తువులు, 6.430 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించుకున్నారు. కరెన్సీ యూఎస్ఏ డాలర్లు 475, సింగపూర్ డాలర్లు 25, ఓమెన్ కరెన్సీ 400, కువైట్ దీనార్లు 7, బ్రిటన్ పౌండ్స్ 10, ఇరాక్ దీనార్లు 1000 వచ్చాయి. హుండీల లెక్కింపులో స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, సీనియరు సిటిజన్లు అధిక సంఖ్యలో పాల్గొనడంతో లెక్కింపు మధ్యాహ్నంతో ముగిసింది. లెక్కింపును ఈవో సూర్యకుమారి, పీఆర్వో అచ్యుతరామయ్య, సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

## బ్యాంకింగ్ నేరాలపై అప్రమత్తత అవసరం

మెయిల్స్‌కు వచ్చే ఫిషింగ్ లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా అపరిచితుల నుంచి వచ్చే మెయిల్స్ ఓపెన్ చేయవద్దని కోరారు. ఏటీఎం కేంద్రాల్లో జరుగుతున్న నేరాలు రోజుకో రకంగా మారుతున్నాయని ప్రతి ఏటీఎం వద్ద భద్రత కోసం ప్రైవేటు సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులకు సంబంధించి పాన్‌కార్డు, ఆధార్‌కార్డుల అనుసంధానం, ప్రభుత్వ, విదేశీ బ్యాంకింగ్ లావాదేవీలు తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలను చర్చించారు. కార్యక్రమంలో డీసీపీలు కాంతిరాణాటాటా, గజరావుభూపాల్‌తో పాటు పలు బ్యాంకుల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ గెలుపు సీఎం కష్టానికి నిదర్శనం

20 ఏళ్ల తర్వాత కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెదేపా జెండాను ఎగురవేయబోతున్నామన్నారు. స్థానికంగా జరిగిన కాకినాడ పురపాలక ఎన్నికల్లో తమ పార్టీకి 38 స్థానాలు వస్తాయని విశ్వాసం వ్యక్తంచేశారు.

# సౌదీలో మహిళకు చిత్రహింసలు



కడప : కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది.. పిల్లల చదువులు.. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నాలుగు డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఆమె గల్ఫ్ దేశానికి వెళ్లారు. అక్కడికి వెళ్లినప్పటి నుంచి చిత్రహింసలు మొదలయ్యాయి. రాత్రింబవళ్లు పని చేయించారు. ఒక దఫాలో సేఠ్ ఆమెపై చెయ్యి చేసుకున్నాడు. దీంతో ఆమెకు ఓ చెవి పని చేయకుండా పోయింది. బాధ ఎవరికి చెప్పుకోవాలన్నా వినేవారే కరవయ్యారు. చివరికి అక్కడే చనిపోవాలని నిర్ణయించుకున్నారు. ఓ ప్రయత్నంగా తనను ఎలాగైనా కడపకు రప్పించాలని ఆమె తన భర్తకు ఫోన్ చేసి కోరారు. భర్త పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆమెను గల్ఫ్‌దేశానికి పంపించిన ఏజెంటును పిలిపించి అతని ద్వారా సేఠ్‌కు ఫోన్ చేయించి ఆమెను ఈనెల 26న కడపకు రప్పించారు. మంగళవారం కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మాసూంబాషా సమక్షంలో ఆమెను భర్తకు అప్పగించారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఆమెను కడపకు రప్పించడంపై పోలీసులకు ఆమె కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

డీఎస్పీ వివరాల మేరకు.. కడప రిమ్స్ ఠాణా పరిధి ఫరీదానగర్‌కు చెందిన వెంకటలక్ష్మి, సంజీవులకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సంజీవులుది మున్సిపాలిటీలో కొళాయికి నీళ్లు వదిలే ఉద్యోగం. సంపాదన అంతంత మాత్రమే. ఇద్దరు పిల్లలకు చదువులు చెప్పించాలని, వారి భవిష్యత్తు దృష్ట్యా వెంకటలక్ష్మి కడప రవీంద్రనగర్‌కు చెందిన ఓ ఏజెంటు ద్వారా 20 నెలల కిందట సౌదీ అరేబియాలోని ఓ సేఠ్ ఇంట్లో పనికి వెళ్లారు. ఖర్చులన్నీ ఏజెంటు భరించారు. ఆమె వెళ్లినప్పటి నుంచి అక్కడ సేఠ్ కుటుంబ సభ్యులకు బండచాకిరీ చేయలేక చాలా అవస్థలు పడ్డారు. మూడంతస్తుల భవనం ఎక్కి దిగాలి. వారు తినే తిండి ఆమెకు నచ్చలేదు. కొన్ని సందర్భాల్లో పస్తులే. ఓసారి సేఠ్ ఆమెపై చెయ్యి చేసుకొన్నాడు. ఆమె చెవి దెబ్బతిని చెవుడు వచ్చింది. వారు పెట్టే చిత్రహింసలు భరించలేక అక్కడే చనిపోవాలని నిర్ణయించుకున్నామని నా ఎదుట వాపోయిందని పోలీసు అధికారులు తెలియజేశారు.

# శ్రీకృష్ణదేవారాయల పాలన సువర్ణాధ్యాయం

## మాజీ ఉపకులపతి ఆచార్య పీవీ అరుణాచలం



చిత్తూరు : విజయనగర సంస్థానాదీశులు శ్రీకృష్ణదేవరాయలవారి పాలన ఓ సువర్ణాధ్యాయమని ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య పీవీ అరుణాచలం పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రేణుకా కల్యాణ మండపంలో శ్రీ కృష్ణదేవరాయల సువర్ణ పాలన వైభవంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీవీ అరుణాచలం మాట్లాడుతూ రాయలవారు ద్రావిడ జాతికి అద్భుతమైన సాహితీ సంపదను అందించారని కొనియాడారు. తెలుగు సాహిత్యం అభివృద్ధికి రాయలవారి కృషి గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ఆచార్య ఎన్ఎన్ మూర్తి మాట్లాడుతూ రాయలవారు నదులను పరిరక్షిస్తూనే చెరువులు, బావుల్ని తవ్వించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారని చెప్పారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి, సాహిత్యానికి పట్టాభిషేకం చేసిన మహనీయుడు రాయలవారని తెలిపారు. గోదాదేవి కల్యాణగాథను తెలిపే ఆముక్తమాల్యదను తెలుగులోకి అనువదించిన సారస్వత సంపన్నుడని అభివర్ణించారు. జాతీయ సదస్సును ఏర్పాటుచేసి సాహితీవేత్తల్ని సన్మానిస్తున్న లలిత కళాసాగర్ వ్యవస్థాపకులు మద్రిపూడి దేవేంద్రరావు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం సాహిత్యం, సమాజ సేవారంగాల్లో విశేష సేవల్ని అందిస్తున్న 54 మంది ప్రముఖులకు జాతీయ, రాష్ట్రీయ పురస్కారాల్ని ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో లలిత కళాసాగర్ వ్యవస్థాపకులు మద్రిపూడి దేవేంద్రరావు, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ పూర్వపు సంచాలకులు చంద్రశేఖర్, సాహితీవేత్త నారాయణస్వామి, తెలుగు విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు సరస్వతి, భాషాభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

# ఇస్కాన్‌లో రాధాష్టమి వేడుకలు

తిరుపతి : తిరుపతి ఇస్కాన్ మందిరంలో మంగళవారం రాధాష్టమి వేడుకగా జరిగింది. వేకువజామున శ్రీ రాధాగోవిందుల అష్టసఖిలకు మహా మంగళహారతి ఇచ్చి అనంతరం విశేషాలంకరణ చేశారు. అమ్మవారి పాదదర్శనార్థం నగరవాసులు వేలాదిగా తరలివచ్చారు. మందిరంలోని స్వామి, అమ్మవార్లకు ప్రపంచంలోని వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో విశేషాలంకరణ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ రాధాగోవిందుల ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం, అనంతరం పుష్పాభిషేకం నిర్వహించారు. మందిరం అధ్యక్షులు రేవతి రమణదాస్ రాధారాణి లీలా ప్రవచనాలను భక్తులకు ఉపదేశించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు 108 రకాల నైవేద్యాలను సమర్పించి, మహాహారతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7.30 గంటలకు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, భక్తులకు రాధారాణి అంశాలు, భగవద్గీతపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. కార్యక్రమంలో మందిర సభ్యులు రూపేశ్వర చైతన్యదాస్, లక్ష్మీపతి చైతన్య దాస్, ప్రధాన పూజారులు గోపాల నివాయి దాస్, మురళి గోవింద్ దాస్, భక్తిక మాతాజీ, ఆమె బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను విస్మరించిన ఎన్ఎంయూ

మదనపల్లె : గుర్తింపు కోసం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఎన్ఎంయూ అమలు పరచలేదని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్ అన్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రోజా కాంప్లెక్స్‌లో జిల్లా స్థాయి సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడారు. గుర్తింపులోకి రావడానికి ఎన్ఎంయూ ఇచ్చిన పలు హామీలను విస్మరించిందని, వాటిని పరిష్కరించడానికి ఇంత వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. కార్మికుల సస్పెన్షన్లు మాత్రం కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో 90 సర్వీసుల రద్దు వల్ల సుమారు 500 మంది కార్మికులకు ఉద్యోగాలు లేకుండా చేసిన ఘనత ఎన్ఎంయూకే దక్కిందని, కార్మికులకు ద్రోహం చేసే చర్యలు చేస్తోందని ప్రభాకర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీసులను నిలపాల్సిన గుర్తింపు యూనియన్ వాటి రద్దుకు సహకరించడం ఎంత వరకు సబబో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడి నుంచి రూ.100 చొప్పున వసూలు చేసి రూ.15 కోట్లతో విజయవాడలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అతి పెద్ద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంతో పాటు 43 శాతం జీతాల పెంపుదల వంటి కార్యక్రమాలను చేపట్టిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్‌కే దక్కిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికులకు ఇచ్చిన బాండ్ల స్థానంలో నగదు ఇప్పిస్తామని చెప్పిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాలంటే ప్రభుత్వంలో విలీనమే శరణ్యమని, ఈ విషయంలో తమ యూనియన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ప్రభాకర్‌యాదవ్ తెలిపారు. సమావేశంలో జోనల్, రీజినల్, జిల్లా డిపోల నాయకులు హరిప్రసాద్, పురుషోత్తం, దేవరాజులు, టి.సత్యనారాయణ, జీఆర్‌చంద్ర, జీఆర్‌బాబు, ఎం.ఎం.రెడ్డి, గిరి, బీఎస్ఆర్‌రెడ్డి, సీఏబాబు, హుసేన్, పూల శ్రీనివాసులు, కేబీ రావు, వైఎస్‌రాములు, పి.శివ, ఎన్.కుమార్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# మహిమాన్వితం కావేరి చరితం

గుంటూరు : ప్రధానమైన పన్నెండు నదులలోనూ కావేరి నదికి ఎంతో విశిష్టత ఉందని, ఆ విశిష్టతను చక్కగా గ్రంథస్తం చేసిన స్వయంపాకుల యలమందల కోటేశ్వరశర్మ కృషి ప్రశంసనీయమని సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు తెలిపారు. స్థానిక సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరి దేవాలయం ప్రవచన మందిరంలో శ్రీకావేరి పుష్కర ప్రాశస్త్యం అనే పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభలో ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. హరిప్రసాదరావు మాట్లాడుతూ నదులకు పుష్కరాలు అనేవి సంప్రదాయబద్ధంగా వస్తున్న ఉత్సవాలు మాత్రమే కాదని మానవాళికి ప్రధాన ఉపకరమైన నీటి విలువను తెలియజెప్పే చైతన్య అంశాలని పేర్కొన్నారు. వెదుళ్ళపల్లికి చెందిన స్వయంపాకుల యలమందల కోటేశ్వరశర్మ గత ఆరు దశాబ్దాలుగా గ్రంథరచన రంగంలో కృషి చేస్తూ ఎన్నో విలువైన గ్రంథాలను మానవాళికి అందించారన్నారు. అనంతరం గ్రంథ రచయిత కోటేశ్వరశర్మ కావేరి నది పుట్టుక, పుష్కర మహిమలను గురించి తెలియజెప్పారు.

# వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వచ్చే నెల 4నుంచి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ముందుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అయిదు గంటలకు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపారు. ఆపై సహస్రనామార్చన, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6గంటల నుంచి 8.30గంటల వరకు అమ్మవారి గర్భాలయం గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. ఆ తరవాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చ, గెడ్డ కర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలిగెడ్డ తదితర సుగంధ పరిమళ ద్రవ్యాలతో గర్భాలయం గోడలను శుభ్రం చేశారు. అనుబంధ ఆలయాలైన శ్రీ సుందర రాజస్వామి, శ్రీ కృష్ణస్వామి ఆలయంలోనూ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 9గంటల తరవాత ఆలయాన్ని శుభ్రం చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో తితిదే ముఖ్య భద్రతా, సూపరింటెండెంట్ మాధవకుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారీ పరిశ్రమలకు

# వేగంగా అనుమతులు

## జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న



చిత్తూరు : జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న భారీ పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వేగంగా మంజూరు చేయాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసే ప్రక్రియను ప్రభుత్వ శాఖలు వేగంగా చేపట్టాలన్నారు. పరిశ్రమల శాఖ అనుమతి లేనిదే తిరస్కరించరాదన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించిన పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలన్నారు. తొట్టంబేడు వద్ద సిరామిక్ పరిశ్రమల క్లస్టర్ సముదాయానికి నీటి సరఫరా కోసం అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. కుప్పంలో తోళ్ల పరిశ్రమలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వ వాటా రూ.1.87 కోట్లు మంజూరు చేశామని, స్టాండప్ ఇండియా కింద 500 మందికి రుణాలు మంజూరు లేఖలు ఇవ్వడానికి చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న వివిధ పరిశ్రమలకు సంబంధించి రూ.3.5 కోట్ల రాయితీలను మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం అనిల్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టరు షిఫి అహమ్మద్, డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్‌రెడ్డి, డీపీవో ప్రభాకరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విజయకుమార్, చిత్తూరు నగరపాలక సంస్థ కమీషనర్ బాలసుబ్రమణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆచార్య గంగప్పకు తెలుగు పురస్కారం ప్రదానం

గుంటూరు : స్థానిక హిందూ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవ సభ జరిగింది. సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆచార్య గంగప్పకు తెలుగు పురస్కారం అందించారు. సన్మానాన్ని అందుకొన్న ఆచార్య గంగప్ప మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాషకు జీవం పోసి తెలుగును రక్షించటానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తెలుగు భాష పరిరక్షణ అనేది కేవలం ఒక్క భాష రక్షణ మాత్రమే కాదని, భాష రక్షణతో సంస్కృతి, సంప్రదాయాలు పది కాలాల పాటు ముందు తరాలకు అందుతాయన్నారు. ఈ ఒక్క విషయాన్ని నేటి యువతరం తల్లిదండ్రులు పెద్దలు గమనించి తెలుగును రక్షించుకోవటం తమ భాధ్యతగా భావించాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తెలుగు రక్షణ విషయంలో పొరుగు రాష్ట్రాలను చూసైనా కొన్ని మంచి పనులు చేస్తే బాగుంటుందని, తమిళ, కర్ణాటక రాష్ట్రాలలో మాతృ భాషకు ఆయా ప్రభుత్వాలు చాలా గొప్పగా ప్రోత్సాహాన్నిస్తున్నాయన్నారు. కళాశాల పాలక మండలి కార్యదర్శి మాజేటి వెంకట రామకోటి ముత్యాలు మాట్లాడుతూ తెలుగు జాతి భాష ఆధారంగా ఉండే గొప్ప జాతి, ఆ భాష నశిస్తే అన్నీ ఇబ్బందులేనన్నారు. భాషతో పాటు సంస్కృతిని, సామాజిక చైతన్యాన్ని కలిగించే శతక పద్యాలను నేర్చుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.గౌరీశంకర్, వైస్‌ప్రిన్సిపాల్స్ కె.జాన్‌మోహన్, వి.భారతి, తెలుగు అధ్యాపకులు నారపరాజు రామకృష్ణ, సంస్కృత శాఖ అధిపతి డాక్టర్ డీ.ఎన్.దీక్షిత్, హిందీ శాఖాధిపతి డాక్టర్ విజయకుమార్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

# తెదేపా అధికార దుర్వినియోగం

## కాకినాడ మేయర్ పీఠం మాదే: వైకాపా నేతలు



సర్పవరంజంక్షన్ : కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడి, ఓటర్లను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేసింది. అయినా ప్రజలు వైకాపా వైపే ఉన్నారని, మేయర్ పీఠం తప్పనిసరిగా కైవసం చేసుకుంటామని జిల్లా వైకాపా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ధీమా వ్యక్తం చేశారు. కాకినాడలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో కలిసి కన్నబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెదేపా నాయకులు నైతిక విలువలకు తిలోదకాలిచ్చారు. పోలీసులు వారికి పరోక్షంగా సహకరించారు. అధికార పార్టీకి చెందిన రౌడీమూకలు రహదారులపై సంచరిస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పట్టించుకోకుండా ప్రచారం ముగిసినప్పటికీ ఇతర ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కాకినాడలోనే తిష్టవేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు.

అతితక్కువ పోలింగ్ జరగడానికి తెదేపా నాయకులే కారణమన్నారు. ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రాజధానిలో ఉండాల్సిన ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారులను కాకినాడకు తీసుకువచ్చి సర్వే చేయించి తెదేపా బలహీనంగా ఉన్న డివిజన్లలో విచ్చలవిడిగా నగదు, మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసింది. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో అక్రమ మార్గాల్లో గెలిచి భాజపా అధినాయకత్వం మెప్పు పొంది రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా పొత్తు కోసం ఇప్పటి నుంచే వెంపర్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య, గిరజాల బాబు, పితాని బాలకృష్ణ పాల్గొన్నారు.

# సాయంత్రం రండి.. శీఘ్రంగా స్వామిని దర్శించుకోండి

## ధర్మదర్శనం భక్తులకు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు సూచన



తిరుమల : శ్రీవారి ధర్మదర్శనానికి వచ్చే భక్తులు సాయంత్రం వేళ వచ్చినట్లైతే.. స్వామి దర్శనం శీఘ్రంగా లభిస్తుందని తిరుమల జేఈవో శ్రీనివాసరాజు సూచించారు. తిరుమల అన్నమయ్య భవన సమావేశ మందిరంలో శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై జేఈవో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటు అధికారులతో అనంతరం మీడియాతో వేర్వేరుగా మాట్లాడారు. కాలినడకన వచ్చే యాత్రికులకు ఇచ్చే దివ్యదర్శనం టోకెన్లు 20 వేలు, రూ.300 టిక్కెట్‌పై ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు 20 వేలు కలిపి నిత్యం 40 వేల మందికి స్వామి దర్శనం నిర్దేశిత సమయానికి కల్పిస్తున్నాం. వీరు వేచి ఉండాల్సిన పని లేదు. రాత్రి స్వామివారి నైవేద్య సమయానికి వీరంతా దర్శనం చేసుకొని వెళ్లిపోతున్నారు. అనంతరం అర్ధరాత్రి 12.45 గంటల వరకు ధర్మదర్శనం భక్తులకే ప్రాధాన్యమిస్తున్నాం. వాహనాల్లో వచ్చే యాత్రికులు సాయంత్రం తర్వాత వైకుంఠం-2కు చేరుకున్నట్లయితే.. శీఘ్రంగా శ్రీవారి దర్శనం లభించే అవకాశం ఉంది. అయితే, రద్దీ సాధారణంగా ఉండే రోజుల్లో మాత్రమే ఇది వర్తిస్తుందని జేఈవో వివరించారు. వారం రోజులుగా రాత్రిపూట ధర్మదర్శనం వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పగటిపూట వైకుంఠం-2కు చేరుకునే యాత్రికులు పునఃప్రవేశ కార్డులు తీసుకుని కంపార్ట్‌మెంట్ల నుంచి వెలుపలికి వెళ్లి.. తిరిగి సమయానికి ప్రవేశించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు జేఈవో తెలిపారు. భక్తకోటికి ఆధ్యాత్మిక ఆనందం కలిగేలా సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. దేవస్థానంలోని అన్ని విభాగాలు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాయని, ఇంజినీరింగ్ విభాగం అత్యంత వేగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. సప్తగిరి సత్రాల నుంచి ఆస్థాన మండపం వరకు ఇనుప వంతెన నిర్మాణం చేపట్టామని, వచ్చే నెల 20 నాటికి ఈ పనులు పూర్తి అవుతాయని చెప్పారు. శ్రీవారి వాహనసేవలను యాత్రికులు వీక్షించడానికి వీలుగా తిరువీధుల్లో 19 ఎల్ఈడీ తెరలు, వెలుపల 11 ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వైకుంఠం-2కు అనుబంధంగా ఉన్న వంటశాల నుంచి అన్నప్రసాదాలు తయారు చేసి ఉత్సవాల్లో భక్తులకు సరఫరా చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఔటర్‌రింగ్ రోడ్డు మూడో దశ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పార్కింగ్‌కు వినియోగిస్తామన్నారు. గరుడోత్సవం రోజున అలిపిరి సమీపంలోని భారతీయ విద్యాభవన్ పాఠశాల మైదానం, దేవలోక్ ప్రాంగణంలో నాలుగు చక్రాల వాహనాలు 2,500 వరకు నిలుపుకొనేలా చర్యలు తీసుకున్నట్లు జేఈవో తెలిపారు. సమావేశంలో తితిదే సీవీఎస్వో ఆకే రవికృష్ణ, ముఖ్య గణాంకాధికారి బాలాజీ, ఎస్ఈ రామచంద్రారెడ్డి, రవాణాశాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు కోదండరామారావు, వేణుగోపాల్, హరీంద్రనాథ్, ఆరోగ్యశాఖ అధికారిణి శర్మిష్ట, ఉద్యానశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసులు, క్యాటరింగ్ అధికారి జీఎల్ఎన్ శాస్త్రి పాల్గొన్నారు.

# నీరు-ప్రగతి పనులు వేగవంతం చేయండి

## జల వనరులశాఖ ఎస్ఈ శ్రీరామకృష్ణ



చిత్తూరు : జల వనరుల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నీరు-ప్రగతి పనులను వేగవంతం చేయాలని జిల్లా జల వనరుల శాఖ పర్యవేక్షణ ఇంజినీరు శ్రీరామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా జల వనరులశాఖ కార్యాలయంలో ఆ శాఖ ఈఈలు, డీఈలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు-ప్రగతి పథకంలో జిల్లాలో 5417 పనులు మంజూరు చేశామన్నారు. ఇందులో 3493 పనులు పురోగతిలో ఉండగా.. 1345 పనులు పూర్తయ్యాయని చెప్పారు. రోజువారీగా పనుల ప్రగతిపై అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. పలు మండలాల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని, వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. పనుల నాణ్యతలో రాజీలేదని, నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువుల బలోపేతంలో భాగంగా నాబార్డు, రాష్ట్ర ప్రణాళిక, ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధుల ద్వారా చేపడుతున్న పనులు వివిధ దశల్లో ఉన్నాయని, పెండింగ్ పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ కారణంగా ఆగిపోయిన పనులకు సంబంధించి సత్వరమే ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం నీరు-ప్రగతి, నాబార్డు పనులపై డివిజన్ల వారీగా సమీక్షించారు.

చెరువులకు సకాలంలో జియోట్యాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు 11 మంది ఏఈలకు తాఖీదు నోటీసులు జారీ చేయాలని ఎస్ఈ శ్రీరామకృష్ణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జలవనరులైన చెరువుల స్థితిగతులు, నీటి సామర్థ్యం, ఆయకట్టు తదితర అంశాలపై అంచనా వేయడానికి ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో చెరువులకు జియోట్యాగింగ్‌కు చర్యలు చేపట్టి పూర్తి చేసింది. జిల్లాలోని చౌడేపల్లె, కలకడ, కార్వేటినగరం, పులిచెర్ల, సదుం, సోమల, శ్రీకాళహస్తి, ఏర్పేడు, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె, పీలేరు మండలాల్లో జియోట్యాంగింగ్ పూర్తికాలేదన్నారు. తక్షణమే వంద శాతం జియోట్యాగింగ్ పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఈఈలు కృష్ణమూర్తి, సురేష్, నాగభూషణం, నీలకంఠారెడ్డి, నజీర్‌హుస్సేన్, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### తస్మాత్ జాగ్రత్త!

మన ప్రయోజనాల పరిరక్షణకు సొంత విధానాలను ఏమేర అనుసరించగలదనేది ప్రధానం. అమెరికా పాకిస్థాన్‌ను దూరంగా పెట్టి, భారత్‌కు మద్దతు ఇవ్వడం పట్ల మన విదేశాంగ మంత్రిత్వ శాఖ హర్షం వెలిబుచ్చింది. కానీ ఈ మద్దతు వెనుక గల ఉద్దేశాన్ని కూడా గ్రహించాలె. భారత్‌ను సైనికంగా అఫ్ఘానిస్థాన్ రొంపిలోకి దింపే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే నామమాత్రంగా ఉన్న సైనిక సహకారాన్ని పెంచే విధంగా ఒత్తిడి తేవచ్చు. నాటోయేతర మిత్రపక్షంగా దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాల ను కాపాడటం భారత్ బాధ్యతగా మారిపోవచ్చు. అందువల్ల భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలె. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించిన దక్షిణాసియా విధానం ప్రచ్ఛన్న యుద్ధానంతరం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉన్నది. పాకిస్థాన్‌ను ఇరుకున పెట్టి భారత్‌వైపు స్పష్టమైన మొగ్గను ప్రకటించింది. కానీ అఫ్ఘానిస్థాన్ విధానమే ఆశ్చర్యం కలిగిస్తున్నది. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అఫ్ఘానిస్థాన్‌లో సైనిక చర్యకు వ్యతిరేకంగా మాట్లాడారు. ప్రజాభిప్రాయం కూడా అఫ్ఘానిస్థాన్‌లో యుద్ధానికి త్వరగా ముగింపు పలుకాలనే రీతిలో ఉన్నది. కానీ అధికారం చేపట్టిన తరువాత ఇప్పుడు మరింత మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అఫ్ఘానిస్థాన్ నుంచి నిర్ణీత కాల వ్యవధిలో దళాలను ఉపసంహరించుకోవాలనేది ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానం. అది ఎప్పుడు సాధ్యమవుతుందో తెలువదు కానీ, సాధ్యమైనంత తొందరగా ఆ యుద్ధం నుంచి బయటపడాలనే అభిప్రాయమే బలంగా ఉండేది. కానీ ఇప్పుడు ట్రంప్ నిర్ణీత కాల వ్యవధి అంటూ ఏమీ ఉండదని అంటున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రంప్ ఈ నిర్ణయానికి రావడానికి కూడా కారణం ఉన్నది. ఇరాక్ లో మాదిరిగా తమ దళాలను ఉపసంహరించుకుంటే ఆ శూన్యాన్ని ఉగ్రవాద శక్తులు భర్తీ చేస్తాయనే ఆందోళన అమెరికాకు ఉన్నది. కానీ అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నది. సంక్షేమ విధానాలు సన్నగిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధ వ్యయాన్ని ఎట్లా భర్తీ చేస్తారనేది పెద్ద సమస్య. యుద్ధం మొదలుపెట్టారు కనుక లబ్ధి జరిగే రీతిలో గౌరవంగా బయటపడాలె. కానీ గతంతో పోలిస్తే తాలిబన్లు అఫ్ఘానిస్థాన్ అంతటికీ విస్తరించారు. అటు ఇరాన్ ఇటు చైనా, రష్యా కాచుకొని ఉన్నాయి. ఈ పరిస్థితులలో యుద్ధభారాన్ని మిత్ర పక్షాలపై మోపాలనేది ట్రంప్ ఆలోచనగా కనిపిస్తున్నది. అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు ఉన్నది కనుక, అఫ్ఘానిస్థాన్ అభివృద్ధికి తోడ్పడాలని ట్రంప్ పక్కా వ్యాపారి తరహాలో వ్యాఖ్యానించడం గమనార్హం. అఫ్ఘానిస్థాన్ మధ్య ఆసియా, దక్షిణాసియా, పశ్చిమాసియాలో ప్రాబల్యం కాపాడుకోవడాని కి కీలకం. కానీ అఫ్ఘానిస్థాన్- పాకిస్థాన్ ప్రాంతం తాలిబన్లు, ఐఎస్ తదితర ఉగ్రవాద వర్గాలకు కేంద్రంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. మరోవైపు భారత్‌ను మెప్పించడానికి ప్రయత్నిస్తున్నది. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేద్దామనే ఆకాంక్షను ట్రంప్ వ్యక్తం చేశారు. అఫ్ఘానిస్థాన్ వ్యూహంలో భారత్ కలిసి రావాలని కోరుకుంటున్నది. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టింది. 2001 నుంచి ఇప్పటివరకు మూడు వందల కోట్ల డాలర్ల మేర ఆర్థిక సహాయం అం దించింది. రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు పార్లమెంటు భవనాన్ని కూడా నిర్మించి పెట్టింది. ఇకముందు కూడా పునర్నిర్మాణంలో భారత్ తోడ్పాటు ఉంటుంది. కానీ ట్రంప్ ఆశిస్తున్నది అంతకుమించిన సైనిక సహాయం. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌కు నాలుగు సైనిక హెలికాప్టర్లను సమకూర్చింది. భారత్ నుంచి మరింత సైనిక మద్దతు కావాలని అమెరికా సైనిక కమాండర్ జాన్ నికల్సన్ గత ఏడాది కోరారు. కానీ అఫ్ఘానిస్థాన్ యుద్ధం మొదలు పెట్టి పదహారేండ్లు అవుతున్నది. నాటో దేశాలు సైనికంగా, ఆర్థికంగా భారీగా నష్టపోయాయి. అమెరికా, యూరప్ దేశాలలోని ప్రజలు అఫ్ఘానిస్థాన్ పోరాటం పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్న ట్టు తాజా సర్వేలు సూచిస్తున్నాయి. పాకిస్థాన్ ప్రచ్ఛన్న యుద్ధకాలమంతా అమెరికా మిత్రదేశంగా ఉన్నది. భారత్ సోవియెట్ యూనియన్‌తో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నది. ఈ మైత్రి అంతర్జాతీయ రంగంలో బల ప్రదర్శనకు, దౌత్య విధానాలకే పరిమితం కాదు. అమెరికా సూచించిన ఆంతరంగిక, ఆర్థిక విధానా లు పాకిస్థాన్‌ను కల్లోల భరితం చేశాయి. భారత్ సోవియెట్ యూనియన్ వైపు మొగ్గు చూపినప్పటికీ, అలీన విధానాన్ని వదిలిపెట్టలేదు. స్వావలంబన, సంక్షేమ విధానాలను కూడా అనుసరించి అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది. నాటో కూటమి, వార్సా కూటమి పరస్పరం ఒలింపిక్ క్రీడలను కూడా బహిష్కరించుకుంది.

## చిగురుటాకులా వణుకుతున్న హూస్టన్



వాషింగ్టన్: హరికేన్ హార్వీ ధాటికి అమెరికాలోని హూస్టన్ నగరం చిగురుటాకులా వణుకుతోంది. ప్రజలు ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు.

విపరీతంగా వర్షం కురుస్తుండడంతో ప్రభుత్వం అక్కడ కరూ విధించింది. లూటీలు, దొంగతనాలు, ఇతర నేరాలను అదుపు చేయడానికి కర్ఫ్యూ విధించినట్లు హూస్టన్ నగర మేయర్ సిల్వెస్టర్ టర్నర్ పేర్కొన్నారు.

వరదలో చిక్కుకున్నవారికి సహాయం చేసేందుకు వెళ్లే బృందాలు, వ్యక్తులకు మినహాయింపు ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ఇక్కడ వర్షపాతం నమోదైంది. హూస్టన్ సిటీలో పలు ప్రాంతాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. చాలా ఇళ్లు ధ్వంసంకాగా.. 15 మంది చనిపోయారు. వేల సంఖ్యలో ప్రజలు తమ ఇళ్లను వదిలి.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ షెల్టర్లలో కాలం గడుపుతున్నారు.

## దినకరన్ వర్గానికి గవర్నర్ ఝలక్!



చెన్నై : తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకేలో చెలరేగిన సంక్షోభం ఇంకా ప్రకంపలను రేపుతూనే ఉంది. దాదాపు 20మందికిపైగా దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడంతో అసెంబ్లీలో వెంటనే బలపరీక్ష నిర్వహించాలంటూ ప్రతిపక్ష నేతలు మరోసారి గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిశారు. వెంటనే అసెంబ్లీని సమావేశపరిచి.. సీఎం పళనిస్వామిపై విశ్వాసపరీక్షకు అనుమతించాలని ప్రతిపక్ష సభ్యులు గవర్నర్ కోరారు. అయితే, ప్రతిపక్షాల విజ్ఞప్తిని గవర్నర్ తోసిపుచ్చారు. సీఎం పళనిస్వామిపై ఎదురుతిరిగిన దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు ఇంకా అన్నాడీఎంకేలోనే కొనసాగుతున్నారని, కాబట్టి రెబల్స్ డిమాండ్ మేరకు తాను నడుచుకోలేనని ఆయన షాక్ ఇచ్చారు. పళనిస్వామిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను గవర్నర్ సున్నితంగా తిరస్కరించారని ప్రతిపక్ష వీసీకే పార్టీ నేత తిరుమవలవాన్ తెలిపారు.

ప్రస్తుతం దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు రిసార్ట్‌లో గడుపుతూ క్యాంపు రాజకీయాలు నడుపుతున్న సంగతి తెలిసిందే. గవర్నర్ విద్యాసాగర్‌రావు అసెంబ్లీని సమావేశపరిచి.. బలపరీక్షను ఎప్పుడు నిర్వహిస్తారా అని వారు ఎదురుచూస్తున్నారు. అయితే, ఇప్పట్లో సీఎం పళనిస్వామికి వ్యతిరేకంగా బలపరీక్ష ఉండబోదనే సంకేతాలు తాజాగా గవర్నర్ ఇచ్చినట్టయిందని, ఇది దినకరన్ వర్గానికి ఎదురుదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వరద కష్టాల్లోనూ.. మెలానియా సోకులు!



వాషింగ్టన్: వరద ప్రాంతాలను సందర్శించడానికి వెళ్లిన సందర్భంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ మరీ సోకులకు పోవడం విమర్శలపాలైంది. ఇటీవల తీవ్ర వర్షాలు, వరదలతో ఛిన్నాభిన్నం అయిన టెక్సస్‌ను మంగళవారం ట్రంప్, ఆయన భార్య మెలానియా సందర్శించారు. ట్రంప్ హయాంలో అతిపెద్ద విలయంగా భావిస్తున్న టెక్సస్ విపత్తు నేపథ్యంలో అధ్యక్షుడు, ఆయన సతీమణి ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యంత ఫ్యాషనబుల్‌గా కనిపించడానికి ట్రంప్, మెలానియా ప్రయత్నించడం అమెరికన్లను విస్తుపోయేలా చేసింది. ముఖ్యంగా మెలానియా మరీ ఎత్తుగా ఉన్న హైహీల్స్ వేసుకోవడం అందరి దృష్టి ఆకర్షించింది. టెక్సస్ వరద కష్టాలు ముంచెత్తిన సందర్భంలోనూ ట్రంప్, మెలానియా ఇలా సోకులకు పోవడం ఏమిటని అమెరికన్ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

టైలర్డ్ కాప్రి ప్యాంట్, ఆర్మీ ఆకుపచ్చ రంగు బాంబర్ జాకెట్, ఏవియేటర్ సన్‌గ్లాసెస్, స్కై-హై హిల్స్ షుస్‌ను మెలానియా ధరించగా.. ట్రంప్ హుడెడ్ రెయిన్ జాకెట్, ఖాకీ రంగు ప్యాంటు, ముదురురంగు బూట్లు వేసుకున్నారు. వీరి సోకులపై ట్విట్టర్‌లో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మెలానియా అచ్చం వరదలను చూస్తున్న బార్బీలా ఉంది' అని రచయిత మారియా డెల్ రుసో ట్వీట్ చేయగా.. 'టెక్సస్ వాసులారా ఆందోళన చెందకండి. సాయం అందుతుంది. మెలానియా తుఫాన్ అంత ఎత్తున హైహీల్స్ వేసుకుంది' అని మరో నెటిజన్ కామెంట్ చేశారు.

## ఆపరేషన్ థియేటర్‌లో వైద్యుల నిర్వాకం

రాజస్థాన్: మనిషి ప్రాణాలు కాపాడే వైద్యుడిని దేవుడితో పోలుస్తారు. కానీ అలాంటి వైద్యులే తమ విద్యుక్త ధర్మాన్ని మరిచిపోయి.. ఏకంగా ఆపరేషన్ థియేటర్‌లోనే గొడవపడితే.. ప్రసవం కోసం వచ్చిన నిండు గర్భిణీని ఆపరేషన్ బెడ్ మీద పడుకోబెట్టి.. తమలో తాము కుస్తీపట్లకు దిగితే.. ఈ దారుణమే రాజస్థాన్ జోధ్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఓ నిండూ గర్భిణీ కడుపునొప్పితో జోధ్‌పూర్ ఉమైద్ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు శస్త్రచికిత్స నిర్వహిస్తున్న సమయంలో డెలివరీని ఆపి ఇద్దరు వైద్యులు ఏకంగా ఆపరేషన్ థియేటర్‌లోనే గొడవపడ్డారు. ఒకరినొకరు ఇష్టం వచ్చినట్టు తిట్టుకున్నారు. ఇలా వైద్యులు నిర్లక్ష్యం వహించడంతో బాధిత మహిళ ప్రసవించిన పసికందు మృతిచెందింది. దీంతో ఆస్పత్రి తీరుపై, వైద్యుల నిర్లక్ష్యంపై బాధిత మహిళ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటన నేపథ్యంలో గొడవకు దిగిన ఇద్దరు వైద్యులను విధుల నుంచి తొలగించినట్టు ఉమైద్ ఆస్పత్రి సూపరింటిండెంట్ ఆల్ భట్ తెలిపారు. ఇద్దరు వైద్యులపై త్వరలోనే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కడుపులోనొప్పితో, లో హార్ట్‌బీట్‌తో మహిళ ఆస్పత్రిలో చేరిందని, అయినా నవజాత శిశువు మృతిపై దర్యాప్తు జరుపుతామన్నారు.

## కవి సమయం

### మధుర భాషణం

మధుర భాషణం శాంతిమయ జీవవానికి సోపానం
ఓదార్పు నిచ్చే ఒక మంచి మాట
వెన్నెల లాంటి చల్లదన్నానిచ్చే ఒక హిత వచనం
జీవితాలను ధైర్యమిచ్చి నిలబెడతాయి
ప్రేమతో కూడిన మధురమైన పలుకులు
నడి సంద్రం లో కొట్టుకొని పోవు వారికి దొరికే ఆలంబన వంటివి
మధుర భాషణం గావించలేని వారు రజో గుణ సంపన్నులు
అసుర సమానులు, అనుక్షణం కొండంత పాపాన్ని సమకూర్చుకుందురు
కటువైన మాటలు గోడకు కొట్టిన బంతుల వంటివి
మరింత వేగం గా, తీవ్రం గా, కటువుగా వచ్చి విసిరిన వారికే తగులును
మనం నాటిన విత్తనాల పంట మనమే అనుభవించక తప్పదు
మధుర భాషణమును చేసిన బుద్ధుడు, మహమ్మద్, జీసస్ మనకు ఆధారం
అందుకే సమాజం లో సత్యం, ధర్మం, అహింస స్థాపనకు
ఆనందమయ సమ సమాజ నిర్మాణమునకు
మధుర భాషణమనే సద్గుణమును అలవర్చుకుందాం
మహనీయిలుగా చరిత్రలో సుస్థిర స్థానమును సాధించుకుందాం

కవిత రచన :
సి . ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి : దశమి పూర్తి మూల రా.తె. 4.53
వ.ఉ. 11.06ల 12.52 వ.రా.తె. 3.16ల 4.52

గురువారం
31-08-2017

**మేషం** : మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్య వేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతత్రా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విష యాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.



## శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

### సంకీర్తన

ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుమ్రహ్మణ్యేశ్వరుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి సమర్పించడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయారుచేసి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలుదేరుతారు. సుబ్రహ్మణ్యే శ్వరుడు సర్పాకారుడు కావడంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు.అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లివిరియాలని మనసావాచా అందరూ పూజిస్తారు.

శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు. జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మ ణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వధించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫుటమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. అందుచేత ఆషాఢ మాస శుక్లపక్ష పంచమి, షష్టి పుణ్యదినాల్లో భక్తులు స్వామిని విశేషంగా సేవిస్తారు. వీటిని స్కందపంచమి, కుమార షష్టి పర్వదినాలు జరుపుకుంటారు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఔషధ నిరోధకతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి

## నెదర్లాండ్ ప్రభుత్వంతో అవగాహన



గుంటూరు : ఔషధ నిరోధకత(డ్రగ్ రెసిస్టెన్స్)పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత్, నెదర్లాండ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా దిల్లీ నుంచి ఎన్‌సీడీసీ సంయుక్త సంచాలకులు లతాకపూర్ నేతృత్వంలో నెదర్లాండ్ ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ఏర్పాటైన బృందం గుంటూరు వైద్య కళాశాల, సర్వజనాసుపత్రిని సందర్శించారు. ప్రయోగశాలలు, ఐసీయూలు, వార్డులను పరిశీలించారు. ఔషధ నిరోధకతను పట్టించుకోకపోతే యాంటీ బయాటిక్స్ ఆవిర్భవించడానికి ముందునాటి పరిస్థితులు పునరావృతమవుతాయన్న భయాందోళనలను ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. యాంటీబయాటిక్స్ అతివాడకాన్ని, దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఈ బృందం కార్యాచరణ రూపొందించనుంది. నివేదిక రూపొందించే ముందు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు బోధనాసుపత్రి, జిల్లా ఆసుపత్రి, పశువుల ఆసుపత్రిని ఈ బృందం సందర్శించేవిధంగా ప్రణాళిక తయారు చేశారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లతాకపూర్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా వైద్య ఆరోగ్య స్టెరిలైజేషన్ విధానాలు పాటించడం వల్ల కూడా ఔషధ నిరోధకతను కొంతవరకు నియంత్రించవచ్చని సూచించారు. వైద్యులు, నర్సులు ఇతర సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. నేడు స్పందించకపోతే రేపన్నది ఉండదన్న హెచ్చరిక విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఔషధ నిరోధకత గణాంకాలను ఏవిధంగా తయారు చేయాలో తమ కార్యాలయం నుంచి నమూనా పత్రాలను పంపుతామన్నారు. ఏదో ఒక యాంటీబయాటిక్ వాడేసే బదులు కల్చర్ పరీక్ష చేసి ఇన్ఫెక్షన్‌కు కారకమవుతున్న బ్యాక్టీరియా ఏదో గుర్తించి, దానికి తగిన యాంటీబయాటిక్‌నే వాడటం వల్ల వ్యాధి పూర్తిగా నయమైపోతుందన్నారు. ఆ మందుకు నిరోధకత పెరగదన్నారు. అదేవిధంగా పశుసంవర్థక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఔషధ నియంత్రణ మండలి అధికారులను ఈ కార్యక్రమం అమల్లో భాగస్వాములను చేస్తున్నామన్నారు. వీరికి అవసరమైన సమాచారాన్ని ప్రిన్సిపల్ సుబ్బారావు, సూపరింటెండెంట్ రాజునాయుడు అందజేశారు. ఈ బృందంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు గీతాప్రసాదిని, నెదర్లాండ్స్ దేశం నుంచి రోసా మారియా పెరన్ సాలా నేత్రత్వంలో ఆరుగురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎస్పీ కార్యాలయానికి కరవైన రోడ్డు బురదలోనే నడుచుకుంటూ వెళ్లాలి

కడప : రోడ్ల మీద రోడ్లు వేసి బిల్లులు చేసుకుంటున్నారు.. బాగున్న రోడ్లను తవ్వి వాటిపై తిరిగి రోడ్లు వేస్తున్నారు.. ఒకే ఒక ఇల్లుంటే చాలు అక్కడికి కూడా సిమెంటు రోడ్లు వేస్తున్నారు.. అవసరం లేకున్నా రోడ్లు వేస్తున్నారు.. ఇప్పటి వరకు సిమెంటు రోడ్డుకు నోచుకోని దారిలో సిమెంటు రోడ్డు వేయక పోవడం విడ్డూరంగా ఉంది. కడప పోలీసు సబ్ డివిజన్ కార్యాలయానికి వెళ్లే దారి సిమెంటు రోడ్డుకు నోచుకోకపోవడం బాధాకరం. ఈ దారి గుండా మూడు కార్యాలయాలకు వాహన దారులు, పాదాచారులు వెళ్తుంటారు. కొన్నేళ్ల నుంచి ఈ రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. సంబంధిత అధికారులెవ్వరు పట్టించుకోలేదు. అతి సమీపంలో ఎస్పీ బంగళా, నగరపాలక కార్యాలయం, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీల కార్యాలయాలు, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ కార్యాలయం, అటవీశాఖ కార్యాలయాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు డీఎస్పీ కార్యాలయం రోడ్డు మొత్తం బురదగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షం వస్తే చాలా చిత్తడిగా మారుతోంది. రోడ్డు మొత్తం ఎగుడు.. దిగుడుగా ఉంది. వాహనదారులు, పాదాచారులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. డీఎస్పీని కలిసేందుకు ప్రతి రోజు ఎంతో మంది వస్తుంటారు. ఈ బురద నీటిలోనే నడుచుకుని వెళ్తుంటారు. డీఎస్పీ కార్యాలయం ఎదుటనే నీటి మడుగు ఏర్పడింది. దారి సరిగా లేకపోవడంతో నీరు నిల్వ ఉన్నాయి. అక్కడ మురుగు వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో మురుగు నీరంతా బయటికి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డీఎస్పీ కార్యాలయానికి సిమెంటు రోడ్డు వేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

## సౌందర్య సాధనాల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



ఆటోనగర్ : అనుమతులు లేకుండా సౌందర్య సాధనాలు (కాస్మోటిక్స్), నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్న ఆటోనగర్‌లోని ఓ దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి చేసిన ఈ దాడుల్లో కొన్ని శాంపిల్స్‌ను సేకరించి, సరకును సీజ్ చేశారు. మొగల్రాజపురం సున్నపు బట్టీల సెంటర్‌కు చెందిన రేపాల శివశంకర్ ప్రసాద్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో టెక్ పార్కు సమీపంలో శ్రీ సిద్ధి వినాయక ట్రేడర్స్ పేరిట ఎనిమిది నెలల కిందట షాపును ఏర్పాటు చేశారు.

అతను వేలంలో సౌందర్య సాధనాలను, నిత్యావసర వస్తువులు, దుస్తులను కొనుగోలు చేసి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఎటువంటి లైసెన్సులు లేకుండా విక్రయాలు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో జిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రవీంద్రనాధ్ బాబు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్.విజయ్‌పాల్ పర్యవేక్షణలో ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.వెంకటేశ్వరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి దుకాణంలో తనిఖీలు చేశారు.

సౌందర్య ఉత్ప త్తులపై తయారీ తేదీ, గడువు తేదీగాని లేనట్లు గుర్తించారు. వాటి విక్రయాలకు సంబంధించిన అనుమతులు లేవని తేలింది. సౌందర్య సాధ నాల నమూనాలను సేకరించారు. దుకాణంలో 160 కిలోల కందిపప్పు, 30 కిలోల సాయిమినపప్పు ఉండగా వాటిలో రంగులు, రసాయనాల పొడి కలిపారనే అనుమానంతో నమూనాలు తీసుకున్నారు. వీటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపిస్తున్నామని, అందులో రంగులు, రసాయనాలు కలిపినట్లు ధ్రువీకరణ అయితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి లైసెన్సులు లేకుండా విక్రయిస్తున్నందున స్టాకునంతా సీజ్ చేసినట్లు డీఎస్పీ విజయ్‌పాల్ తెలిపారు.

## తిరుపతమ్మ ప్యానల్ హ్యాట్రిక్ విజయం

గుంటూరు : సర్వజనాసుపత్రి సుపీరియర్ ఎంప్లాయిస్ పరపతి సంఘం ఎన్నికల్లో తిరుపతమ్మ ప్యానల్ ఘన విజయం సాధించింది. వరసగా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ సాధించింది. శుశృతాహాలులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మూడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొత్తం 253 మందికి ఓటు హక్కు ఉండగా 211 మంది వినియోగించుకున్నారు. ఇందులో ఎనిమిది ఓట్లు చెల్లనివిగా అధికారులు గుర్తించారు. ధనలక్ష్మి 131, తిరుపతమ్మ 128, సుశీల 125, నగరాజకుమారి 121, సంపూర్ణ 121 ఓట్లు సాధించారు. ఈ ఐదుగురు సభ్యులు బుధవారం సమావేశమై అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. ఉద్యోగ విరమణ చేసిన సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ హనుమయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల నుంచి సేకరించిన మూలధనం నుంచి సంఘ సభ్యులకు రుణం మంజూరు చేస్తుంటారు. ఈ కార్యవర్గం ఐదు సంవత్సరాల పాటు పనిచేయనుంది. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వసంతరాయులు

నెల్లూరు : నెల్లూరు జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తోటపల్లిగూడూరు మండలం కోడూరు పశు వైద్యశాల వైద్యులు ఆర్.వసంతరాయులు విజయం సాధించారు. ఈయన వాకాడు మండలం బాలిరెడ్డిపల్లి పాళెం పశువైద్యులు ఎ.ఉదయచైతన్యపై గెలుపొందారు. నెల్లూరు నగరం రైల్వే ఫీడర్స్ రోడ్డులోని జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఈ అసోసియేషన్ అధ్యక్ష పదవి తప్ప మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి మాత్రం పోటీ నెలకొంది. దీంతో ఆత్మకూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జయచంద్ర, బుచ్చిరెడ్డిపాళెం ఏడీ డాక్టర్ మురళీకృష్ణ ఎన్నికల పరిశీలకులుగా, ఆ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, గుంటూరు నుంచి వచ్చిన డాక్టర్ శివశంకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈఅసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేశ్వర్లు (ఏఎస్‌పేట, పశు వైద్యులు), కోశాధికారిగా డి.సుబ్బనాయుడు (అనంతసాగరం, పశువైద్యులు), ఉపాధ్యక్షులుగా శ్రావణ్‌కుమార్ (హెల్త్ అసిస్టెంట్, స్టడీలీవ్‌లో ఉన్నారు), సంయుక్త కార్యదర్శిగా షేక్. మహ్మద్ అలి (కలిగిరి, పెద్దకొండూరు, పశు వైద్యులు) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2012 సంవత్సరం తరువాత ఇప్పుడే ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి డాక్టర్ ఐ.కృష్ణమౌర్య ఈ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉంటూ వచ్చారు. తొలుత కొందరు వైద్యులు ఎన్నికల ముందు జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నూతన నాయకత్వం పశువైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## ఆటా ఉత్తమ రచయితగా రావినూతల ప్రేమకిషోర్

నెల్లూరు : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డీ టీచర్స్ అసోసియేషన్ (ఆటా) ఏటా ప్రతిష్ఠాత్మకంగా అందజేసే ఆటా జాతీయ పురస్కారాలకు ఉత్తమ రచయిత కేటగిరిలో నెల్లూరు విద్యాశాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రావినూతల ప్రేమకిషోర్ ఎంపికైనట్లు ఆటా జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ అవార్డును ప్రేమకిషోర్ దంపతులు అక్టోబరు 8వ తేదీన భద్రాచలంలో అందుకుంటారన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన ఈయన ఇదివరకు హైదరాబాదు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయంలో ఎస్ఎస్‌సీ బోర్డులో 25 ఏళ్లు పనిచేశారు. ఇప్పటి వరకు 150 అవార్డులు అందుకున్నారు. ఆటా ఉత్తమ రచయిత అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఈయనను పలువురు అబినంధించారు.

## మద్యం దుకాణం వద్ద ఐద్వా ధర్నా

రాజమహేంద్రవరం : స్థానిక గోరక్షణపేట సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని రద్దు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో దుకాణం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు టి.సావిత్రి, జిల్లా కార్యదర్శి తులసి మాట్లాడారు. మురికివాడ ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల పేద, మధ్య తరగతికి చెందిన యువత తాగుడుకు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఎయిడెడ్ పాఠశాలతోపాటు, ఆర్టీసీ ప్రధాన రహదారి కావడంతో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపించారు. తక్షణం దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పడాల లక్ష్మీ, బళ్లా అన్నపూర్ణ, అనిశెట్టి పద్మ, రమణమ్మ, నాగరత్నం, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంఘ నిర్వహణపై పశ్చిమ్ బంగా బృందం పరిశీలన

తాళ్లరేవు: మండలంలోని ఉషోదయ వికలాంగుల సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలను పశ్చిమ్ బంగా రాష్ట్రానికి చెందిన సీబీఆర్ ప్రాజెక్టు ప్రతినిధులు పరిశీలించారు. చొల్లంగి, పాత కోరంగి, తాళ్లరేవు గ్రామాల్లో వారు సందర్శించారు. వికలాంగులకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు, వికలాంగుల ఐక్యత కోసం చేపట్టిన కార్యక్రమాలపై సీబిఆర్ ప్రాజెక్టు సమన్వయకర్త రితీష్ కుమార్ నేతృత్వంలో అధ్యయనం చేశారు. అనంతరం మండల ఉషోదయ వికలాంగుల సంక్షేమ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై పశ్చిమ్ బంగా సీబీఆర్ ప్రాజెక్టు ప్రతినిధులకు ఈ ప్రాంత సమన్వయకర్త ఎస్.ఎ.నాయుడు వివరించారు. ఈ ర్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల సీతామహాలక్ష్మి, కావూరి శ్రీనివాస్, ఎమ్.జె. గోపాల్, సబ్బితి దొరబాబు, విత్తనాల గోవిందరాజు, స్వర్ణ మహాలక్ష్మి పాల్గొన్నారు.

## మొక్కలు నాటితే ఉచిత వైద్య పరీక్షలు డీఎఫ్‌వో శ్రీనివాసులు

చిత్తూరు : మొక్కలు నాటిన విద్యార్థులకు, గ్రామస్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించనున్నట్లు సామాజిక వన విభాగం అటవీ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. దీనికి సంబంధించి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ప్రకటించారు. పాఠశాలల్లో మొక్కలు నాటిన విద్యార్థులకు పంటి, కంటి వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తామన్నారు. ఆలయాల పరిసరాల్లో వృక్ష ప్రసాదం పేరుతో ఉసిరి, మారేడు, తులసి, రావి, వేప చెట్లను నాటిస్తామని, అందుకు ఆలయ అధికారులు, నిర్వాహకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఏవరైనా ఒక వ్యక్తి 5 మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు స్థానిక వైద్యులు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరిస్తూ లేఖ అందిస్తే ప్రైవేటు ఆసుపత్రిలో గుండె సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని స్పష్టం చేశారు. నవంబరు నెలాఖరు వరకూ మొత్తం 2 వేల మందికి ఈ పరీక్షలు చేయించనున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటి భావితరాలకు వృక్షాలను అందించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో పల్లెవనాలు ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. జిల్లాలో మొదటి విడతగా 50 గ్రామాల్లో వనాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని, సంబంధిత సర్పంచులు, గ్రామస్తులు కోరితే రూ.50 వేల వ్యయంతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కంచె ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్కడే ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఇసుక నిల్వ చేసి, ప్రజలు సేద తీరేలా బల్లలు నిర్మిస్తామన్నారు.

## క్రీడల్లో రాణించండి : జేసీ-2




నెల్లూరు : ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించి దేశ పేరు ప్రతిష్ఠలు పెంచాలని జిల్లా సంయుక్త కలెక్టరు వెంకట సుబ్బారెడ్డి కోరారు. క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన సంక్షేమ సంఘం సంయుక్తంగా క్రీడా వేడుకలు నిర్వహించారు. తొలుత ఉదయం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఏసీ క్రీడా మైదానం నుంచి సాగిన ఈ ర్యాలీ తితిదే కల్యాణ మండపం మీదుగా వెళ్లి తిరిగి ఏసీ మైదానానికి చేరుకుంది. అనంతరం భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అందరికీ క్రీడ స్ఫూర్తి రావాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరకోల్లాసం లభిస్తుందన్నారు. సెట్నల్ సీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశం గర్వించేలా ప్రతిఒక్కరూ క్రీడాకారులుగా రాణించాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీవీ రమణయ్య మాట్లాడారు. అంతకముందు 16 ఏళ్లలోపు బాలలకు క్రీడల్లో పోటీలు నిర్వహించారు.

విజేతల వివరాలు..

హాకీ బాలుర విభాగంలో గూడూరు గెలుపొందగా, బాలికల విభాగంలో వెల్లంటి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గెలిచారు. కబడ్డీ బాలుర విభాగంలో ఏసీ స్టేడియం, బాలికల విభాగంలో కొత్త కోడూరు జట్లు గెలుపొందాయి. వాలీబాల్ బాలుర విభాగంలో లేగుంటపాడు జట్టు, బాలికల విభాగంలో కొత్తవంగళ్లు జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి జిల్లా సంయుక్త కలెక్టరు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం కోశాధికారి పసుపులేటి రామమూర్తి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి థామస్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు, శిక్షకులు పాల్గొన్నారు. ఇటీవల యోగాలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన జ్యోష్ణవి, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి భువిని ఘనంగా సన్మానించారు.

# నాసిరకం ఆహార పదార్థాల తయారీ కేంద్రాలపై దాడులు

కరీంనగర్ : కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యతలేని ఐస్‌క్రీం, కుళ్లిపోయిన పచ్చళ్లను తయారుచేస్తున్న కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తూ, దుర్గంధం కొడుతున్న శివాస్ బిర్యాని హౌస్‌పై దాడిచేసి, నిర్వాహకుడు దూలం శివశంకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ కోర్టుచౌరస్తాలోని శివాస్ బిర్యాని హౌస్, ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో కుళ్లిపోయి, దుర్వాసన వస్తున్న మాంసం ఉపయోగించి బిర్యాని, ఇతర ఆహార పదార్థాలను తయారుచేసి వినియోగదారులకు వడ్డిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. టాస్క్‌ఫోర్స్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. బిర్యాని హౌస్‌లో పదిరోజుల కిందట నుంచి ఉన్న మాంసం, కుళ్లిన, పాచిన కూరల నుంచి దుర్గంధం వెలువడుతోంది. వాసన రాకుండా సుగంధ ద్రవ్యాలు ఉపయోగిస్తున్నట్లు దాడుల్లో వెలుగుచూసింది. నిన్న, మొన్న మిగిలినటువంటి బిర్యాని నుంచి బయటకు తీసిన మాంసం ముక్కలను శుభ్రం చేసి, వేడి బిర్యానీతో వడ్డిస్తున్నట్లు తేలింది. బిర్యాని తయారుచేస్తున్న వంటగది అపరిశుభ్రంగా, అస్తవ్యస్థంగా ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. బిర్యాని సెంటర్‌లోని ఆహార పదార్థాల నమూనాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సేకరించి నాచారంలోని ప్రయోగశాలకు పంపించారు.

రాంనగర్‌లో క్వాలిటీ వన్ కంపెనీ పేరుతో నాణ్యతలేని, కల్తీ పదార్థాలతో తయారు చేస్తున్న ఐస్‌క్రీం కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. కేంద్రంలో భారీ మొత్తంలో తయారవుతున్న నాసిరకపు ఐస్‌క్రీం ఉత్పత్తులను గుర్తించి, సీజ్ చేశారు. నిర్వాహకుడు దారపునేని కృష్ణను విచారించారు. కృష్ణా జిల్లాకు చెందిన కృష్ణ ఐదేళ్ల కిందట కరీంనగర్‌కు వచ్చి ఎలాంటి అనుమతులు లేకుండా, కల్తీ పదార్థాలతో, నాసిరకపు క్రీంలతో ఐస్‌క్రీం తయారుచేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నమూనాలు సేకరించి, నివేదిక అందిన తరువాత చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బూజుపట్టి, పాడైపోయిన పచ్చడి విక్రయ కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇంట్లో సిమెంట్‌తో తయారు చేసిన హౌజుల్లో పచ్చడిని పులియబెట్టారు. రోజులు గడవడంతో పచ్చడి బూజుపట్టి చెడిపోయింది. ఈ పచ్చడికి నూనె, కారం, రంగు కలిపి నగరంలోని హోటళ్లు, కిరాణాలకు విక్రయిస్తున్నారు. తయారీ విధానం శుభ్రంగా లేకపోవడం, పరిసరాలు సరిగ్గా లేకపోవడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మొత్తం 5 వేల కిలోల పచ్చడిని పారబోయించి, నిర్వాహకుడు సదానందంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ గౌస్‌బాబా, ఎస్సైలు కిరణ్, సంతోష్, నాగరాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అమృతశ్రీ, సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

# చిన్నారుల్లో డిప్రెషన్




ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది.

ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ముఖవర్చస్సుకు క్యారెట్



మహిళలకు అందమైన మోముంటే అందరూ చాలా బాగుందంటారు. దీనికి రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కాని ఇంట్లో దొరికే వస్తువులతో ప్రయోగాలు చేసుకోవచ్చంటున్నారు సౌందర్య నిపుణులు.

దీనికి చేయవలసిందల్లా ఒక్కటే... బంగారం లాం టి మేనిమి ఛాయ బంగారంలా మెరవాలన్నా, కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఏ పుష్కలంగా ఉండే క్యారెట్టును వాడాలంటున్నారు. బ్యుటీషియన్స్. ముందుగా ఒక క్యారెట్‌ను తురుముకోవాలి.


అందులో ఒక చెంచా పాలను అందులో కలుపుకొని కాసింత నీటిలో ఉడకబెట్టాలి. చల్లారిన తర్వాత పాలనుకలుపుకుని ముఖానికి, శరీరానికి పట్టిం చండి.

అరగంట అయిన తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరచండి. దీంతో మీ చర్మం కాంతి వంతంగా మారడమే కాకుండా మృదువుగా తయార వుతుంది. ఏదైన వాడే ముందు వాటికి తగిన జాగ్రత్తలు పాటించడం చాలా మంచిది. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో స్కిన్ సమస్యలు దృష్టిలో ఉంచుకుని వాటిని వాడటం మరి మంచిది. అందం గురించి జాగ్రత్తలు తీసుకునే మందు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు పాటించడం ఇంకా మంచిది.




# కడుపులో రాళ్లు పడితే..!

- పిత్తాశయంలో కదలికలు మందగిస్తాయి
- కడుపులో రాళ్లను తొలగించడమే పరిష్కారం
- రాళ్లు ఎక్కువగా ఉంటే జీర్ణం కాదు
- పిత్తాశయ గోడల్లో వాపు వస్తుంది




ఇటీవల కాలంలో కడుపులో రాళ్లు పడటం అన్నది కామన్‌గా మారింది. ఈ మధ్య చిన్న పిల్లల్లో కూడా ఈ సమస్యను గుర్తించటం జరుగుతోంది. తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న వారిలో ఈ సమస్య కనిపిస్తోంది. జీర్ణ వ్యవస్థలోని పిత్తాశయం (గాల్ బ్లాడర్), క్లోమం (పాన్ క్రియాజ్) వంటి భాగాల్లో ఈ రాళ్లు ఏర్పడుతుంటాయి. ఈ రాళ్లతో వచ్చిన అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఈ రాళ్లను బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. రాళ్లను తొలగించటం అన్నది అంతిమ పరిష్కారం అని గుర్తుంచుకోవాలి.

పైత్యరసంలోని కొలిసిస్టిన్ ఎక్కువగా ఏర్పడి నప్పుడు ఇబ్బంది ఏర్పడుతుం ది. దీంతో పాటు పిత్తాశయంలో వాపు ఏర్పడే అవకాశం ఉంటుం ది. దీన్ని కొలిసిస్టిటిస్ అని వ్యవహరిస్తారు. నొప్పి తీవ్రత ద్వారా దీన్ని గుర్తించవచ్చు. కుడి వె%పు పై భాగంలో ఇది మొదలవుతుంది. తర్వాత కుడిపైపు స్కా ప్యులా ఎముక ఉండే చోటికి వ్యాపించవచు. చాలాసార్లు వేపుళ్లు, నూనె దినుసులు, జంక్ ఫుడ్ తిన్న తర్వాత తలెత్తుతుంటుంది. కొద్ది పా టి జ్వరం, డయేరియా, వాంతులు, నాసియా వంటి లక్షణాల్ని కూడా గమనించవచ్చు. కొన్ని సార్లు పిత్తాశయం గోడల్లో వాపు గమనించవచ్చు. తీవ్రమె%న కేసుల్లో నెక్రోసిస్, గోడల్లో ధ్వంసం జరగటాన్ని చూడవచ్చు. గోడలు వాపు ఏర్పడిన పరిస్థితిని సాధారణ కొలిసిస్టిటిస్‌గా వ్యవహరిస్తారు. తర్వాత కాలంలో పిత్తాశయం లో కదలికలు బాగా మందగిస్తాయి. వ్యాధి ముదిరిన దశను తీవ్రతర కొలిసిస్టిటిస్‌గా చెబుతారు.

ఇక క్లోమం విషయానికి వస్తే .. క్లోమంలో స్రవించే ఎంజైమ్‌లు పేగుల్లోకి వచ్చి అక్కడ ఆహారాన్ని జీర్ణం చేయాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ఈ ఎంజె%మ్‌లు క్లోమంలోనే ఉండి పోయి అక్కడ పనిచేయటం మొదలు పెడతాయి. ముఖ్యంగా ట్రిప్సిన్ ఇటువంటి పనులకు పాల్పడుతుంది. దీంతో క్లోమం లోపలి గోడలు పాడె% పోతాయి. క్రమంగా మొత్తం క్లోమం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే పాన్‌క్రియాటిస్‌గా వ్యవహరిస్తారు. ఇక, రాళ్ల సమస్య పెద్దదిగా అయినప్పుడు ఇతర జీర్ణ భాగాలకు ఇబ్బది తలెత్తవచ్చు. కొన్ని సార్లు క్లోమంలో కాల్సియం డిపాజిట్లు ఎక్కువగా పేరుకొని పోతే రాళ్లుగా మారతాయి. ఇవి జీర్ణ రసాల్ని అంటే ఎంజైమ్‌ల స్రావాన్ని అడ్డుకొనుట ద్వారా సమస్యల్ని తెచ్చి పెడతాయి. తీవ్రమైన నొప్పితో పేషంట్లు బాధ పడతారు.


పిత్తాశయంలో రాళ్లను గుర్తించాక అది ప్రాథమిక దశలో ఉందా, లేక వ్యాధి తీవ్రం అవుతోందా అన్నది తేల్చుకొంటారు. చాలా ప్రాథమిక దశ అయినప్పుడు మందులతో వాటిని కరిగించేందుకు యత్నిస్తారు. లేని పక్షంలో కొలిసిస్టెక్టమీ అనే ఆపరేషను అవసరం అవుతుంది. పూర్వం కడుపుని కోసి ఈ ఆపరేషను చేయాల్సి వచ్చేది. ఇప్పు డు లాపరోస్కోపీ విధానంలో ఇది చాలా సురక్షితంగా, తేలికగా మారింది. చాలా సార్లు పిత్తాశయాన్ని తొలగించటమే అంతిమ పరిష్కారం అవుతుంది. క్లోమంలో రాళ్లను కరిగించటానికి లిథో ట్రి ప్సీ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో దీన్ని సురక్షితంగా తేలిగ్గా పూర్తి చేయవచ్చని గుర్తుంచుకోవాలి. ఇది ఆధునిక టెక్నాలజీ తో కూడిన ఆపరేషన కాబట్టి నిపుణులె%న సర్జన్‌లతో చేయించుకోవటం మేలు.

మానవ శరీరంలో అతి చిన్న భాగాల్లో ఒకటిగా పిత్తాశయంను చెప్పుకోవచ్చు. కడుపులో కుడి వైపున పై భాగంలో ఇది అమరి ఉంటుంది. కాలేయానికి కింది భాగంలో ఉండే సంచీ వంటి భాగం ఇది. ఒక రకంగా చెప్పాలంటే కాలేయానికి అనుసంధానంగా వ్యవహరించే భాగం అనుకోవచ్చు. కాలేయం నుంచి స్రవించే పైత్య రసం తాత్కాలికంగా నిల్వ ఉండే సంచీ వంటి భాగమే పిత్తాశయం. పైత్య రసంలో వాస్తవానికి ఎటువంటి ఎంజైములు ఉండవు. కానీ, జీర్ణక్రియకు సహకరించే కొలెస్టిరాల్, బైలి రుబిన్ అనే పదార్థాలు ఇందులో ఉంటాయి. పైత్య రసం పిత్తాశయంలో ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు కొలిస్టిరాల్‌కానీ, బైలిరుబిన్ కానీ ఎక్కువగా పేరుకొని పోతుంది. అటువంటప్పుడు ఈ పదార్థాలు ఘన రూపంలోకి మారి రాళ్లుగా పరిణామం చెందుతాయి. కొలిస్టిరాల్ కానీ రాళ్లుగా మారితే కొలిస్టిరాల్ రాళ్లు అనీ, బైలిరుబిన్ ఘన పదార్థంగా మారితే పిగ్మెంట్‌రాళ్లు అని వ్యవహరిస్తారు. పైత రసం లో ఇతర పదార్థాల శాతం పెరిగిపోయినా ఇది తలెత్తవచ్చు. కాలేయ వ్యాధులు, రక్త ప్రస రణ వ్యాధులు తలెత్తినప్పుడు కూడా రాళ్లు వస్తుంటాయి. రాళ్లతో నేరుగా వచ్చే ప్రమాదం కంటే ఇతర సమస్యలతో ఇబ్బందులు ఉంటాయి.

# గోళ్ల ఆరోగ్యమే ... వేళ్ల అందం

శుభ్రత అనగానే ముందు గుర్తురావాల్సింది చెతులకున్న గోళ్లు. ఎందుకంటే, మనం ఏం తిన్నా ముందు నోట్లోకి వెళ్లాడానికి అస్కారం ఉంది. కాబాట్టి అలాంటి గోళ్లనే మనం నిర్లక్ష్యం చేస్తే, అది అనారోగ్యమని తెలిసినా సరే! ఎప్పటికప్పుడు అనుకుంటూనే మరేం ఫర్వాలేదని బద్ధకించేయడమూ మనకున్న నిత్యమైన అలవాటు. గోళ్ల విషయం లోనే! పైగా గోళ్లను చూసి ఆరోగ్యం ఎలా ఉందో చెప్పేస్తారు వైద్యులు. మరి నఖాల గురించి కొన్ని విషయాలు తెలుసుకుంటే ఆపై జాగ్రత్తలు తీసుకోవడం ఎంత అవసరమో తెలిసిపోతుందిగా!కొందరు రికార్డుల కోసం గోళ్లను పెంచుతుంటారు.అలాంటి వారికి ఇవి చాలా ఉపయోగకరం గోళ్లను పెంచుతారు కాని వారు శుభ్రం పాటించరు అలాంటి వారు క్రింది విధానాలను తెలుసుకోవచ్చు.గోళ్లు కొరుక్కోవడం అనే అలవాటు ఉంటే తక్షణం మానుకోవడం బెటర్!

గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. ఎన్నో రకాల సూక్ష్మక్రిములు, మట్టి నోట్లోకి వెళ్లేది గోళ్ల ద్వారానే! స్నానం తరువాత కత్తిరించుకుంటే గోళ్లు మెత్తగా ఉండి కత్తిరించడం సులువవుతుంది. లేకుంటే పెళుసుగా ఉండి విరిగిపోతాయి. నెయిల్ పాలిష్ వేసుకోవడం ఓకే! కానీ, అదేపనిగా గోళ్లరంగు మంచిది కాదు. ఎందుకంటే రసాయనాలు నిండిన గోళ్లరంగు నోట్లోకి వెళితే అనేక అనర్థాలకు దారితీస్తుంది. గోళ్లు పగుళ్లు తీసినట్లున్నా, కాంతిహీనంగా ఉన్నాయంటే మన శరీరంలో విటమిన్ ఎ, కేల్షియమ్ లోపించాయని అర్థం. అందుకే విటమిన్ ఎ ఉన్న కేరెట్లు, పళ్లు, ఆకుకూరలు, కేల్షియమ్ మెండుగా ఉన్న పాలు, బాదాములు అధికంగా తీసుకోవాలి. అప్పుడే గోళ్లు గులాబీ రంగులో చూడముచ్చటగా మారేది! కాలకృత్యాలు తీర్చుకున్నాక ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగిస్తున్నారంటే చేతులారా వాటిని పాడుచేస్తున్నట్లే! ఈ



**అలవాటుకు స్వస్తి పలికితే నయం!**

ముఖ్యంగ రాత్రి నిద్రపోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కుని, తుడుచుకున్నాక మాయిశ్చరైజర్ అప్లై చేస్తే చేతులు, గోళ్లు మృదువుగా ఉంటాయి.

సబ్బుల వాడకం సమయంలో జాగ్రత్త పాటించాలి.

శరీరానికే కాదు, నీరు గోళ్లకూ అవసరమే! కాబట్టి, మంచినీళ్లు ఎక్కువగా తాగండి!అహారం తీసుకొనే సమయంలో వాటిని చాలా శుభ్రం చేసుకోవాలి.

నాణ్యమైన నెయిల్‌పాలిష్ వాడితే మంచిది.

నెయిల్ పాలిష్ తీయాలంటే బ్లేడుతో గీకడం కాకుండా నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించాలి.

గోళ్లను పెంచే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

తాజా పోషకాహారం తీసుకుంటే గోళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి.

12 విటమిన్ లోపిస్తే గోళ్లు పొడిబారి, నల్లగా మారతాయి. గుడ్డు, పాలు, మాంసం... వంటివాటిలో

12 సమృద్ధిగా వుంటుంది.ఈ జాగ్రత్తలు చాలు! గులాబీ వర్ణంలో మెరిసే సౌందర్యం మీ సొంతమవడానికి! చూపరులను ఇట్టే ఆకట్టుకోవడానికి!

# నీళ్లు సరిగ్గా తాగడం లేదని తెలిపే డేంజర్ సంకేతాలివే..

*నీళ్లు తాగుతున్నారా ? అంటే బాగా తాగున్నాను అన్న సమాధానమే చాలా మంది చెబుతారు. కానీ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక బాటిల్ లేదా ఒక లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. ఇది ఒకరు, ఇద్దరి సమస్య కాదు. చాలా మంది నీళ్లు తాగాలంటే చాలా బద్ధకంగా ఫీలవుతారు. అలాగే నీళ్ల తాగడం అంటే.. ఏదో మెడిసిన్ తాగినట్టు ఫీలవుతుంటారు. కానీ.. నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. 10 రోజుల్లో ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే వాటర్ డైట్ శరీరంలోని ప్రతి భాగం, ప్రతి చిన్న అవయవం, టిష్యూ, కణం అన్నీ కూడా నీటిపై ఆధారపడి ఉంటాయి. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఫ్లూయిడ్స్ స్థాయి బ్యాలెన్స్‌గా ఉంటుంది.*

*బాడీ టెంపరేచర్ రెగ్యులేట్ అవుతుంది. మలినాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అంతే చర్మం ప్రకాశవంతంగా కనిపించడానికి కూడా నీళ్లు తాగడం తప్పనిసరి. రైస్ వాటర్‌తో మైండ్ బ్లోయింగ్ బెన్ఫిట్స్ అయితే శరీరానికి కావాల్సిన స్థాయిలో నీళ్లు అందకపోతే.. శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయి.*

# మాతృత్వపు మధురిమ ఆస్వాదించండి



గర్భధారణ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం చాలా సర్వసాధరణం. ఈ మార్పులు ప్రతి మహిళ శరీరంలోనూ ఏర్పడుతాయి. గర్భధారణ సమయంలో మహిళలకు సాధారణ జీవితాన్ని గడపాలని సూచిస్తుంటారు. అయితే గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కాబట్టి గర్భధారణ సమయంలో ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండటం ఉత్తమైన మార్గం. దాని తర్వాత అన్నీ. ఎందుకంటే గర్భధారణ అనేది 9నెలలు మాత్రమే కాబట్టి ఆ 9నెలలు మహిళలకు చాలా విలువె%న సమయంగా భావించాలి. గర్భధారణ సమయంలో ఎటువంటి కార్యకలాపాలు ప్రమాదకరమె%నవో మీకు తెలిసుండకపోవచ్చు. కానీ మనకు తెలసిన కొన్ని కార్యకలాపాలు మాత్రం న్యూట్రీషియన్ ఫుడ్ అధికంగా తీసుకోవాలి. దూరప్రయాణాలు చేయకూ డదు. దగ్గర ప్రయాణలైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలి మరియు అధిక బరువులు మోయకూడదు మొదలగునవి. కాబట్టీ మీ గర్భధారణ సమయంలో సురక్షితంగా ఉండటానికి చాలా చాలా లౌకిక విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. ఉదా: మీకు రాక్ బ్యాండ్ యొక్క సంగీతానికి హాజరు కావడం అనేది గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపంగా చెప్పవచ్చు. గర్భధారణ సమయంలో అధికంగా వ్యాయామం చేయడంతో హార్ట్ బీట్ పెరుగుతుంది మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెంచుతుంది. గర్భధారణ సమయంలో ఉదర భాగంలో వ్యాక్సింగ్ చేయించుకోవడం కూడా మంచిది కాదు. ఇటువంటి కొన్ని చిన్న విషయాలు మీ గర్భధారణ సమయంలో సురక్షితమా కాదా అని గుర్తించేందుకు మరికొన్ని మీకోసం బోల్డ్ స్కై అందిస్తుంది. ఈ రిస్కీ యాక్టివిటీస్ కు గర్భాధారణ సమయంలో దూరంగా ఉండీ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోండి... ఫర్నీచర్‌ను మార్చకూడదు సాధారణంగా ఇంట్లో వస్తువులు ఫర్నీచర్‌ను ఇక్కడి అక్కడ.. అక్కడవి ఇక్కడ మార్చుతుంటారు. అయితే మీ గర్భధారణ మొదటి సెమిస్టర్ (మొదటి మూడు నెలల్లో) ఇటువంటి రీస్కీ యాక్టివిటీస్ ను నివారించడం చాలా క్షేమం. ఇది మీ మీద ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లలను మోయడం** మీ రెండవ ప్రెగ్నెన్సీ కంటే ముందు మీకు పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఉంటుంది కాబట్టి, వారు 5కేజీల బరువు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అతనిని/ఆమెను ఎత్తుకోవడం నివారించడం. లేదంటే మీ వెన్నుకు ఒత్తిడి కలిగించవచ్చు. స్కేటింగ్ వ్యాయామంలో చాలా మంది రోలర్ స్కేటింగ్‌ను ఉపయోగిస్తారు. అయితే మహిళలు గర్భధరించినప్పుడు, ఈ రోలర్ స్కేటింగ్ వ్యాయామాన్ని మానుకోండి. రోలర్ స్కేటింగ్ చేయడానికి మంచి బ్యాలెన్సింగ్ ఉండాలి.స్టీమ్ బాత్‌గర్భధారణ సమయంలో స్టీమ్ బాత్ చేయడం అనేది చెడు ఆలోచన. ఎప్పుడైతే మీ శరీరం వేడి పొందుతుందో, అప్పుడు మీ చర్మని బ్లైడ్ సెల్స్ రీడైరెక్ట్ గావింపబడి మీ చర్మాన్ని చల్లబరుస్తుంది.

# చిత్రభాను

## లక్ష్మీరాయ్.. అంత హాట్‌గానా..!



దాదాపు పద్నాలుగు సంవ త్సరాల కిందట వచ్చిన 'జూలీ' సినిమా అప్పట్లో ఒక సంచలనం. కథాపరంగా ఆకట్టుకున్న ఆ సినిమా అంతకు మించి.. నేహాదూపియా గ్లామర్ షో తో సంచలనంగా నిలిచింది. నేహ స్కిన్ షో విషయంలో రెచ్చిపోయింది. అంతకు ముందు కొన్ని సినిమాలు చేసినా.. 'జూలీ' సినిమా నేహాదూపియాను బాలీవుడ్ లో సెటిలయిపోయేలా చేసింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు వస్తున్న 'జూలీ-2' కూడా అదే రీతిన ఆసక్తిని రేకెత్తిస్తోంది. జూలీని రూపొందించిందిన దీపక్ శివదాసానీ సీక్వెల్ పార్టుతో వచ్చాడు. వచ్చే నెల నాలుగో తేదీన ఈ సినిమా విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమా టీజర్ విడుదల అయ్యింది. ఈ సారి టైటిల్ రోల్‌లో దక్షిణాదిన ప్రముఖ తార అయిన రాయ్ లక్ష్మీ నటిస్తోంది. లక్ష్మీ ఈ సినిమాలో జూలీగా నేహాను మరిపించబోతోందని స్పష్టం అవుతోంది టీజర్ తో. నేహాను హాట్ హాట్ ప్రజెంట్ చేసిన దర్శకుడు రాయ్ లక్ష్మీని కూడా అదే రీతిన చూపనున్నాడని టీజర్ తో అర్థం అవుతోంది. విడుదల అయిన 24 గంటల్లోనే యూట్యూబ్ లో కొన్ని లక్షల మంది ఈ సినిమా టీజర్ ను వీక్షించారు. మరి దాదాపు దశాబ్దం పై నుంచినే సరైన హిట్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్న రాయ్ లక్ష్మీ రాతను జూలీ-2 మార్చేయబోతోందేమో చూడాలి.

## బాహుబలితో పోటీ పడటంలేదు

### తానాజీ చిత్రంపై అజయ్ దేవగణ్



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం తానాజీ: ది అన్‌సంగ్ వారియర్. ఛత్రపతి శివాజీ సైన్యంలో సేనాధిపతిగా వ్యవహరించిన సుబేదార్ తానాజీ మలుసరే జీవితాధారంగా ఈ చరిత్రాత్మక చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

అయితే ఈ సినిమాని బాహుబలి కన్నా గొప్ప స్థాయిలో తెరకెక్కించాలని అనుకుంటున్నాం కానీ బాహుబలికి పోటీగా కాదని అంటున్నారు అజయ్. ఈ సినిమాకి సంబంధించిన విషయాలను అజయ్ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

నేను బాహుబలి సినిమాతో పోటీ పడటంలేదు. ప్రేక్షకులకు మంచి సినిమాలు ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంది. మనం తీసే సినిమాల్లో భావోద్వేగాలు, నాటకీయత, థ్రిల్స్ ఎక్కువగా ఉండాలి. లేకపోతే మన సినిమాలను హాలీవుడ్ చిత్రాలు భర్తీ చేస్తాయి. అని చెప్పుకొచ్చారు.

అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన బాద్‌షాహో చిత్రం సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## హీరో భార్యా అరెస్ట్?



మలయాళ నటి ని కిడ్నాప్ చేసి, ఆమెను వేధించిన వ్యవహారంలో సూత్రధారిగా ఇప్పటికే అరెస్టయ్యాడు స్టార్ హీరో దిలీప్.

అయితే ఇప్పుడు అతడి భార్య కావ్య మాధవన్ కు కూడా ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఆమెను పలుసార్లు ప్రశ్నించారు విచారణ అధికారులు. అయితే తాజాగా ఆమెను పోలీసులు అరెస్టు చేయవచ్చనే మాట వినిపిస్తోంది. ఈ కేసులో దాడిలో పాల్గొన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించిన పల్సర్ సునీ ఇచ్చిన సమాచారం మేరకు కావ్యమాధవన్ ను అరెస్టు చేయవచ్చని తెలుస్తోంది. నటిపై దాడి చేసినందుకు గానూ కావ్యనే తమకు డబ్బులు ఇచ్చిందని సునీ చెప్పినట్టుగా తెలుస్తోంది. దాడి చేయాలని సూచించింది, ఎలా దాడి చేయాలని వివరించింది దిలీప్ అయినప్పటికీ.. ఆర్థిక వ్యవహారాల్లో కావ్య ప్రమేయం ఉన్నట్టుగా వార్తలు వస్తున్నాయి. అలాగే దాడి సమయంలో తీసిన ఫొటోలను పల్సర్ సునీ తదితరులు కావ్యకే అందించినట్టుగా కూడా వార్తలు వచ్చాయి. వాటిని ఆమె తన కంప్యూటర్లో సేవ్ చేసిందనే మాట వినిపించింది. ఈ నేపథ్యంలో.. కావ్యను విచారణాధికారులు ప్రశ్నించారు.

మరింత సమగ్ర విచారణ కోసం.. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకోవచ్చని సమాచారం. మరి అదే జరిగితే.. ఈ కేసు మరింత సంచలనంగా మారే అవకాశం ఉంది. దిలీప్ రెండో భార్య కావ్యమాధవన్. దిలీప్ ముందుగా మంజూవారియర్ ను పెళ్లి చేసుకున్నాడు. అయితే కావ్యతో సంబంధం నెరిపాడనే ప్రచారం ఉంది. ఆ సమాచారాన్ని మంజూకు తెలియజేసినందుకే.. నటిపై అతడు దాడి చేయించాడని అంటారు.



## అదే నా సక్సెస్ సీక్రెట్...

చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి ఏడేళ్లయినా సక్సెస్‌ను ఎలా సెలబ్రేట్ చేసుకోవాలో తనకు తెలియదని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఓ సినిమా కోసం పడ్డ కష్టానికి గుర్తింపు లభిస్తే అదే తన ద ృష్టిలో అతిపెద్ద విజయంగా భావిస్తానని అంటున్నది. గత మూడేళ్లుగా తెలుగులో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ సొగసరిని లక్కీస్టార్‌గా చిత్ర వర్గాలు అభివరి?స్తున్నాయి. గోల్డన్ గర్ల్, లక్కీస్టార్ అనే బిరుదులు తాత్కాలికమని, చిరకాలం చిత్రసీమలో మనుగడ సాగించడానికి అవేవీ తోడ్పడవని రకుల్‌ప్రీత్‌సింగ్ పేర్కొంది. ప్రతిభకు తోడు కష్టపడేతత్వమే తనకు విజయాల్ని తెచ్చిపెట్టిందని అంటోంది. విజయం వరించిన తర్వాత దానిని నిలుపుకోవడానికి వేసే ప్రతి అడుగులో జాగ్రత్త పడాలని, కథలో ఎంపికలో మూస ధోరణిలో కాకుండా భిన్నంగా ఆలోచించడమే తన సక్సెస్ సీక్రెట్ అని తెలిపింది. భవిష్యత్తులో చిత్రనిర్మాణ రంగంలో అడుగుపెట్టే ఆలోచన ఉందని అంటున్నది. రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబం నుంచి చిత్రసీమలో అడుగుపెట్టడంతో డబ్బు విలువ నాకు తెలుసు. అందుకే డబ్బుతో ముడిపడిన విషయాల్లో తొందరపాటు నిర?యాలు పనికిరావు. చిత్ర నిర్మాణంపై ఆసక్తి ఉంది. కానీ కథానాయికగా ప్రస్తుతం మంచి అవకాశాలు వస్తున్నాయి. కెరీర్ ద ృష్టిలో పెట్టుకొని కొన్నాళ్లు ఆ ఆలోచనను వాయిదా వేశాను అని తెలిపింది.



## కమల్‌హాసన్ సీరియస్‌గా...

గూండా చట్టం కింద శిక్షించబడాల్సిన వారెందరో వారి అక్రమా లను, అవినీతిని ప్రజలపై మోపుతున్నారని నటుడు కమలహాసన్ వ్యాఖ్యా నించారు. ఈయన ఇటీవల రాజకీయ నాయకుల అవినీతిపై ధ్వజమెత్తుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రమంత్రుల అవినీతిపై ఆధారాలను సేకరించాల్సిందిగా తన అభిమానులకు పిలుపునిచ్చారు కూడా. ఇటీవల నీట్ వ్యవహారం గురించి కమల్ గొంతెత్తారు. దీంతో రాష్ట్రమంత్రులు కమలహాసన్‌పై ఎదరు దాడికి దిగుతున్న వైనం చూస్తున్నాం. కాగా కమలహాసన్ బుల్లితెరపై బిగ్‌బాస్ పేరుతో రియాలిటీ గేమ్ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూలి చిన్న తప్పు చేసినందుకు ఆమెపై కోపం వ్యక్తం చేస్తున్నారని, ఈ చిన్న అమ్మాయిపై అంతగా కోపం పనికిరాదని అన్నారు. అలాగైతే రాజకీయ నాయకులను ఎందుకు వదిలేస్తున్నారు? వాళ్లంతా గూండా చట్టం క్రింద జైలు శిక్ష అనుభవించాల్సిన వారని, బయట స్వేచ్ఛగా తిరుగుతూ, తమ అవినీతి, అక్రమాలను ప్రజలపై రుద్దుతున్నారని వ్యాఖ్యానించారు. కాబట్టి మీ కోపాన్ని ఇలా వృథా చేయరాదని, దాని అవసరం భవిష్యత్తులో చాలా ఉంటుందని పేర్కొన్నారు. మీరంతా న్యాయం కోసం మాట్లాడే తీరాలని కమల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అందువల్ల కోపాన్ని కాస్త తగ్గించుకోవాలని అన్నారు. మీ శక్తి తనకు మండే వస్తువు అవుతుందని పరోక్షంగా తన రాజకీయ పోరాటానికి దోహదపడుతుందని అన్నారు. కాగా ఇప్పటి వరకూ ట్విట్టర్ ద్వారానే రాజకీయాలపై తన భావాలను వెల్లడించిన కమలహాసన్ ఇప్పుడు టీవీ కార్యక్రమం ద్వారా బహిరంగంగానే రాజకీయ వాదులపై విమర్శలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది.

## థాంక్స్ డియర్ కోడలా...

ఈ ఏడాది అక్కినేని ఇంట కోడలిగా అడుగుపెట్టబోతున్నది సమంత. అక్టోబర్ 6న నాగచైతన్య, సమంతల వివాహం గోవాలో హిందు, క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతుల్లో జరగనున్నది. ప్రస్తుతం పెళ్లి ఏర్పాట్లలో ఈ జంట బిజీగా ఉన్నారు. తాజాగా మంగళవారం తన మావయ్య నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు తనదైన శైలిలో శు భాకాంక్షలు చెప్పింది సమంత. ఈ మామాకోడళ్ల సంభాషణ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. నాగార్జున ప్రధాన పాత్రలో ఓంకార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం రాజుగారి గది-2. ఈ చిత్రంలో సమంత ఓ కీలక పాత్రను పోషిస్తున్నది. నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను సమంత స్వయంగా విడుదల చేసింది. అంతేకాకుండా కాబోయే మామకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. మామయ్య ఎప్పటికి కింగ్. తనను తాను ఎలా పరిపాలించుకోవాలో ఆయనకు బాగా తెలుసు.

సంవత్సరాలు గడుస్తున్నా కొద్ది మా మామ మరింత గొప్పగా కనిపిస్తున్నారు. హ్యాపీబర్త్‌డే మామయ్య అంటూ ట్వీట్ చేసింది సమంత. ఆమె ట్వీట్‌కు నాగార్జున స్పందించారు. థాంక్స్ డియర్ కోడలా. యూ ఆర్ ద బెస్ట్ అంటూ రీ ట్వీట్ చేశారు. ఈ మామ కోడళ్ల మధ్య సాగిన సంభాషణ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది.



# బీఆర్డీలో ఘోరం

- ఆగని చిన్నారుల మరణం
- ఒకే నెలలో 290 మంది!
- ఐసీయూలో 213 మంది
- మెదడువాపు వ్యాధితో 77 మంది



గోరఖ్‌పూర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ మెడికల్ కళాశాల (బీఆర్డీ)లో చిన్నారుల మరణాలు ఆగడం లేదు. ఆక్సిజన్ అందక చిన్నారులు పిట్టల్లా రాలిపోయిన విషయం తెలిసిందే. ఒక్క ఆగస్టు నెలలోనే 290 మంది చిన్నారులు ఆస్పత్రిలో మరణించారని కళాశాల ప్రిన్సిపల్ పీకే సింగ్ వెల్లడించారు. వీరిలో చిన్నారుల ఐసీయూలో 213 మంది మృతిచెందగా.. మెదడువాపు వ్యాధి వార్డులో 77 మంది కన్నుమూశారని తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 1250 మంది చిన్నారులు మరణించారని వెల్లడించారు. ముఖ్యంగా మెదడువాపు, నవజాత, చిన్నారుల వార్డుల్లోనే ఈ మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో మరో 37 మంది చిన్నారులు కన్నుమూశారని వెల్లడించారు.

మరణాలకు సంబంధించిన కారణాలను కూడా సింగ్ విశ్లేషించారు. వివిధ రకాల సమస్యలతో చిన్నారులు ఆస్పత్రిలో చేరుతున్నారన్నారు. ముఖ్యంగా నెలలు నిండని చిన్నారులు, తక్కువ బరువు గల శిశువులు, కామెర్లు, న్యుమోనియా వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు ఇక్కడ చేరుతుంటారని తెలిపారు. పరిస్థితి విషమించిన తర్వాతనే ఇక్కడ ఎక్కువగా చేర్పిస్తున్నారని, సకాలంలో తీసుకొస్తే వారి ప్రాణాలను కాపాడగలమని పేర్కొన్నారు.

### టెస్టు క్రికెట్‌లో

# బంగ్లా సంచలన విజయం



ఢాకా: టెస్టు క్రికెట్‌లో పసికూన బంగ్లాదేశ్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. అది కూడా ఆషామాషీ జట్టుపై కాదు ప్రత్యర్థులను బెంబేలెత్తించే కంగారూలపై. ఆస్ట్రేలియాపై టెస్టుల్లో బంగ్లాదేశ్‌కి ఇదే తొలి విజయం కావడం విశేషం.

మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు ఈ నెల 27న ప్రారంభమైంది. టాస్ గెలిచిన బంగ్లా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 260 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆసీస్ జట్టు షకీబ్ అల్ హసన్ ధాటికి 217 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్‌కి 43 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాను నాథన్ లియాన్ తన బౌలింగ్‌తో కట్టడి చేశాడు. అతని ధాటికి బంగ్లాదేశ్ 221 పరుగులు మాత్రమే చేయగలిగింది. 265 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ 244 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో బంగ్లాదేశ్.. ఆస్ట్రేలియా జట్టుపై 20 తేడాతో విజయం దక్కించుకుంది.

**షకీబ్ అల్ హసన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన**

బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. ఈ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన హసన్ తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేశాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన హసన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. హసన్ తన టెస్టు కెరీర్‌లో ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు తీయడం ఇది రెండోసారి. ఆస్ట్రేలియాతో 2003 నుంచి ఆడిన 4 టెస్టుల్లో బంగ్లాదేశ్‌కి ఇదే తొలి విజయం. 2004-05మధ్య జింబాబ్వేతో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇప్పటి వరకు 101 టెస్టులాడిన బంగ్లా జట్టుకి ఇది 10వ విజయం. 2017లో ఇప్పటి వరకు 6 టెస్టులు ఆడిన బంగ్లా రెండింట్లో విజయం సాధించింది. ఆసీస్‌పై విజయానికి ముందు బంగ్లా శ్రీలంకపై విజయం సాధించింది.

### డేరాబాబా భూముల్ని

# స్వాధీనం చేసుకోవాలి

### బాబా ఫ్లెక్సీలు, సీడీలు దహనం



నల్గొండ: నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని డేరా సచ్చా సౌధా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని.. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలో గల డేరా ఆశ్రమం వద్ద జెండాలు పాతి నినాదాలు చేశారు. వివాదాస్పద బాబా ఫ్లెక్సీలు, సీడీలు దహనం చేశారు. డేరా భూములను స్వాధీనం చేసుకుని.. అక్రమంగా ఆశ్రయం నిర్మించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఇక పెద్దకార్లపై సెస్

# 25శాతం!

దిల్లీ : మధ్య తరహా, పెద్ద కార్లు, ఎస్‌యూవీలపై సెస్‌ను పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ప్రకారం ఈ కార్లపై ప్రస్తుతం ఉన్న 15శాతం సెస్‌ను 25శాతానికి పెంచింది. కాగా.. ఈ సెస్ పెంపు లగ్జరీ కార్లకు కూడా వర్తించనుంది. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఆ ఆర్డినెన్స్‌ను ఆమోదించి రాష్ట్రపతికి పంపించనున్నారు. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత సీబీఈసీ(సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్) పెంచిన సెస్‌లతో నోటిఫికేషన్ జారీ చేయనుంది.

ఆగస్టు 5న జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఈ కార్ల సెస్‌లను పెంచాలని మండలి నిర్ణయం తీసుకుంది. అయితే సెస్‌ను పెంచాలంటే జీఎస్‌టీ చట్టంలో మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది. కాగా.. పలు రకాల పన్నులను జీఎస్‌టీ కిందకు తేవడంతో జులై 1వ తేదీ నుంచి చాలా ఎస్‌యూవీల ధరలు రూ. 1.1లక్షల నుంచి రూ. 3లక్షల వరకు తగ్గాయి. లగ్జరీ కార్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అయితే తాజా ఆర్డినెన్స్‌తో ఈ కార్ల ధరలు మళ్లీ మోతమోగనున్నాయి.

# తెలుగుకు వెలుగులు నింపుదాం

### పరిపాలనా భాషగా అమలుకు కృషి

అమరావతి: పరిపాలనలో తెలుగు భాష అమలుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ రమామణి పిలుపునిచ్చారు. పాలనంతా తెలుగులోనే సాగాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చిన్న సమావేశ మందిరంలో తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి జేసీ రమామణి, రెండో జేసీ సయ్యద్‌ఖాజా, డీఆర్వో మల్లీశ్వరీదేవి తదితరులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సంఘ సంస్కర్త రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాష దినోత్సవం నిర్వహిస్తోందన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాష అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

మాతృభాషను మరిచిపోతే అమ్మను మరిచిపోయినట్లే అని ఆమె పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో వందశాతం తెలుగుభాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాలన్నారు.

రెండో జేసీ సయ్యద్‌ఖాజా మాట్లాడుతూ ప్రజలకు తెలుగుభాష అర్థమయ్యేలా అందించిన గిడుగు రామ్మూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కవి మధుశ్రీ మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమంలో గిడుగు రామ్మూర్తి కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం కవి మధుశ్రీని జేసీ రమామణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయలక్ష్మీ, పర్యవేక్షకులు వరదరాజులు, వెంకటసుబ్బయ్య, వెంకటనారాయణ, వరప్రసాద్, సోమశేఖర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

హైదరాబాద్: దృష్టి మరల్చి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలోని ఏడుగురు సభ్యులను హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.40వేల నగదు, 5 చరవాణులు, ఓ డెబిట్ కార్డు, గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నామని అఫ్జల్‌గంజ్ సీఐ పీజీ రెడ్డి తెలిపారు. ఈ నెల 22న సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పి.రవీంద్ర అనే వ్యాపారి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో నగదు బ్యాగ్‌తో నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ముఠా సభ్యులు దృష్టి మరల్చి దోపిడీకి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని వెల్లడించారు. త్వరలో జరగబోయే గణేష్ నిమజ్జనం సందర్భంగా దోపిడీలకు పాల్పడేందుకు ఈ ముఠా నగరానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# కోహ్లి లాంటి ఆటగాడ్ని చూడలేదు

భారత కెప్టెన్ విరాట్ కోహ్లి లాంటి క్రికెటర్‌ని తానెక్కడా చూడలేదని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ఆటలో ఎవరినీ అనుసరించకుండా తనకంటూ ప్రత్యేక శైల్ని కోహ్లి సృష్టించుకున్నాడ్ని.. అతను ఈ తరానికి బెస్ట్ క్రికెటర్ అంటూ డివిలియర్స్ ప్రశంసించాడు. గత వారంలో దక్షిణాఫ్రికా వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి అనూహ్యంగా తప్పుకున్న డివిలియర్స్ తాజాగా మీడియాతో సుదీర్ఘంగా మాట్లాడాడు.

వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న క్షణం నుంచీ నేను చాలా హ్యాపీగా ఉన్నాను. ఈ నిర్ణయంతో నేను మళ్లీ రీఫ్రెష్ అయిన భావన కలుగుతోంది. నా జీవితం క్రికెట్‌తో మమేకమైపోయింది. అందుకే.. కెరీర్ చివరాంకంలో ఆటని ఎంజాయ్ చేయాలనే ఉద్దేశంతో కెప్టెన్సీని వదులుకున్నా.

నా కెరీర్ ఇంకో రెండు లేదా.. గరిష్టంగా మరో ఏడేళ్లు ఉండొచ్చేమో నాకు తెలీదు. ఇక వచ్చే ఏడాది భారత్ జట్టు దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ కోసం వస్తోంది. రెండేళ్ల క్రితం మేము భారత్ గడ్డపై ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాం.

కానీ.. ఈ సిరీస్‌లో మాత్రం వారికి గట్టిపోటీనిస్తాం. కెప్టెన్ విరాట్ కోహ్లి తనకంటూ ప్రత్యేక శైలి సృష్టించుకున్నాడు. నా గురించి కోహ్లి ఇప్పటికే చాలా సార్లు చెప్పాడు. కానీ.. అతనే ఈ తరానికి అత్యుత్తమ ఆటగాడు. ఇద్దరం చాలా సరదాగా, ఆటపై అంకితభావంతో గౌరవంగా ఉంటాం అని డివిలియర్స్ వివరించాడు.

### మాతృభాషకే

# ప్రథమ స్థానం

### సమిష్టిగా కృషిచేయాలి



విజయవాడ: తెలుగు భాషను కాపాడేందుకు సమిష్టిగా పాటుపడాలని పలువురు కవులు తమ కవితలతో తెలుగుభాష ఔన్నత్యం గురించి వివరించారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడిని కలకాలం కాపాడుకోవాలని సినీగేయ రచయిత వెన్నెలకంటి అన్నారు.

తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వమాతా ఛారిటబుల్ ట్రస్టు, గాయత్రి సొసైటీల ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాలులో జరిగిన రచయితల సత్కారసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాట్లాడుతూ కన్నతల్లి ఒడి నుంచే మాతృభాష నేర్పించాలన్నారు. పరాయిభాషలెన్ని ఉన్నా మాతృభాషకు ప్రథమస్థానం ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ, శార్వాణిమూర్తి, వలివేటి, తదితరులు పాల్గొన్నారు.

118 మందికి పైగా వర్ధమాన, సీనియర్ కవులు తమ కవితలు వినిపించి అలరించారు. కవులు అందరినీ నిర్వాహకులు వెన్నెలకంటి, మల్లాది విష్ణుల సమక్షంలో సత్కరించారు.

# ఘనంగా రాధాష్టమి వేడుకలు

అనంత : రాధాష్టమి వేడుకలు ఇస్కాన్ మందిరంలో వైభవంగా జరిగాయి. ఈ వేడుక సందర్భంగా రాధారాణి నిజపాద దర్శనం కల్పించారు.

ఏటా నిజపాద దర్శనం రాధాష్టమి రోజున మాత్రమే కల్పిస్తారు. ఉదయం రాధాకృష్ణుల మహాభిషేకం కనుల పండవగా జరిగింది. ఇస్కాన్ ఆలయంలో రాధారాణి జీవిత విశేషాలపై ప్రవచనాలు చేశారు. ఇస్కాన్ దక్షిణ భారత దేశ ఛైర్మన్ సత్యగోపీనాథ్, రాధాకృష్ణుల అన్యోన్యత, వారి జీవిత చరిత్రను వివరించారు. జీఎం దామోదర గౌరంగదాస్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# డాష్‌బోర్డులో ఐసీడీఎస్ సేవలు

అనంతపురం: జిల్లాలో ఐసీడీఎస్ వ్యవస్థలన్నీ బలోపేతం చేసేందుకే కొత్త సాఫ్ట్‌వేర్‌తో వినూత్న కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. ఇందులో ప్రతి అంశాన్ని డాష్‌బోర్డుకు అనుసంధానం చేసినట్లు పోషకాహార పెంపుదల పథకం (ఇస్‌నిప్) జిల్లా సమన్వయకర్త సుధాకర్ పేర్కొన్నారు. శారదానగర్‌లోని ఐసీడీఎస్ అనంత అర్బన్ ప్రాజెక్టు కార్యాలయ సభా మందిరంలో మాస్టర్ శిక్షకులకు ఒక్కరోజు వర్క్‌షాపు జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో ఉన్న అన్ని కార్యక్రమాలను అనుసంధానం చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు.

ప్రయోగాత్మకంగా జిల్లాలో తొమ్మిది ప్రాజెక్టుల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు. అన్నీ మొబైల్‌లోనే నమోదు చేయాలన్నారు. ఆ తర్వాత కేంద్ర సాంకేతిక సంస్థ(సీటీఏ) జిల్లా సమన్వయకర్త రమేష్ సమస్యలపై నివృత్తి చేశారు.

# అలవాట్లే జీవిత సత్యాలు



కాకినాడ: యువత అలవాట్లే జీవిత సత్యాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు యోగా, ధ్యానం చేయటం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఏకాగ్రత లేకుంటే ఎన్నిగంటలు చదివినా బుర్రకు ఎక్కదన్నారు. యోగా గురువు రఘు మాట్లాడుతూ డబ్బు ఉంటే తరిగిపోతుందని, జ్ఞానం పెరుగుతుందన్నారు. ఎంత సంపాదన ఉన్నా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లేనప్పుడు ప్రయోజనం ఉండదన్నారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు పయనించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు ప్రహ్లాదరావు తదితరులు పాల్గొన్నారు.








Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com